నేటి కందం- నేటికి అందం

అరవిరిసి ప్రజాస్వామ్యము
నరజాతికి సేవజేయ-నా హృదయములో
జరిపెదను సంతసముతో
చిరపర్వముగా ప్రపంచ స్వేచ్ఛా దినమున్ !!

(నవంబర్ 9 ప్రపంచ స్వేచ్ఛా దినం)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం

తెలుగు దినపత్రిక

బరక

అరెస్టులు ప్రొటెస్టులు
అన్నీ శరా మామూలే
జైలయినా బేయిలైనా
జరసేపవి కామాలే
నేతలకు భయమేదా
నేడు కేసులెన్నయినా
కడవరకు నిలుస్తాయా
కోర్టులల్లో కొన్నయినా

-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 9-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:78 పేజీలు:6 వెల: రూ.1/-

ఎవరు అడ్డు వచ్చినా.. మూసీ ప్రక్షాళన చేస్తాం !



హైదరాబాద్, నవంబర్ 8:మూసి పరివాహక ప్రాంతంలో రెండున్నర కిలోమీటర్ల మూసి పునరుజ్జీవ పాదయాత్ర చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు..

వరంగా మారాల్సిన మూసీ నది.. శాపంగా మారితే బాగుచేయవద్దా అని రేవంత్ ప్రశ్నించారు. మూసి ప్రక్షాళన ప్రాజెక్టు చేసి తీరుతామని ప్రకటించారు. ముప్పై రోజుల్లో మూసి ప్రక్షాళన ప్రాజెక్టు డిజైన్లు ఖరారు అవుతాయన్నారు. కేసీఆర్,కేటీఆర్, హరీష్ దమ్ముంటే మూసి ప్రక్షాళన ప్రాజెక్టు ఆపేందుకు ప్రయత్నించాలని సవాల్ చేశారు.

ఎవరు అడ్డుకున్నా బుల్డోజర్లతో తొక్కుకుపోయి పనులు చేయిస్తామన్నారు. ఇవాళ చూపించినది ట్రైలర్ మాత్రమేనని .. వాడపల్లి నుంచి జనవరిలో పాదయాత్ర చేస్తానని ప్రకటించారు. ఈ ప్రాంతంలో కులవృత్తులు చేసుకునే పరిస్థితి లేదని, ఇక్కడ పండిన పంటలను తినే పరిస్థితి లేదు.. ఇక్కడి చెరువుల్లో చేపలు బ్రతికే పరిస్థితి లేదని నదిఒడ్డున పెంచే గొర్రె మాంసాన్ని కొనే పరిస్థితి లేదన్నారు.

ఇక్కడ వశువుల పాలు తాగాలన్నా ఆలోచించాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. పాడిపంటలతో ఎంతో సంతోషంగా బతికిన ఇక్కడి ప్రజలు.. ఇవుడు భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ నాయకులకు దోచుకోవడం తప్ప ప్రజలకు మేలు చేయడం తెలియదని.. అందుకే మూసీ ప్రక్షాళన ఆపాలని చూస్తున్నారని అన్నారు.

టిటిడి తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు

– అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ

భువనగిరి నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్): టిటిడి తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ బోర్డుకు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష ముగిసింది. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. యాదాద్రి పేరును యాదగిరిగుట్టగా మార్చాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీ తీసుకరావాలని సిఎం సూచించారు.గోసంరక్షణకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని, కొండపై భక్తులు నిద్రపోయేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. విమానం గోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి భూసేకరణ పూర్తి చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు పూర్తి చేయాలన్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని రేవంత్ తెలిపారు. వారంలోపు పూర్తి వివరాలు, ప్రపోజల్స్‌తో రావాలని సిఎం ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తి నివేదిక అందించాలని సిఎం ఆదేశించారు.

విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు-2024కు హాజరైన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబర్ 8:ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్రపతి... క్రమశిక్షణ, నీతి నిజాయితీలను భారతీయులు ఉన్నత ఆదర్శాలుగా భావిస్తారని అన్నారు. క్రమశిక్షణా రాహిత్యాన్ని ఇష్టపడని భారతీయులు, చట్టాన్ని గౌరవిస్తారనీ, ఆర్భాటాలు లేని సాదాసీదా జీవితాలను గడిపేందుకు ఇష్టపడతారనీ 2300 ఏళ్ళ కిందటే ప్రఖ్యాత గ్రీకు చరిత్రకారుడు మెగస్థనీస్ పేర్కొన్నారని గుర్తు చేశారు. చైనా చరిత్రకారుడు ఫాహియన్ తదితరులు కూడా మన పూర్వీకుల నిరాడంబరత గురించి పేర్కొన్నారని శ్రీమతి ముర్ము చెప్పారు. ఈ నేపథ్యంలో 'చిత్తశుద్ధి ద్వారా జాతి సౌభాగ్యం' అంటూ విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలకు ఈ యేడాది ఇచ్చిన ఇతివృత్తం ఎంతో బాగుందని ప్రశంసించారు.

సామాజిక జీవనానికి నమ్మకం పునాది వంటిదని, ఐక్యతకు అదే సూత్రమనీ, ప్రభుత్వం చేపట్టే సంక్షేమం, వివిధ కార్యక్రమాలపై ప్రజలకు గల నమ్మకమే ప్రభుత్వ పాలనకు బలాన్ని అందిస్తుందని రాష్ట్రపతి అన్నారు. అవినీతి ఆర్థిక పురోభివృద్ధిని కుంటుపరచడమే కాక, విశ్వాస రాహిత్యానికి దారితీస్తుందన్నారు. ప్రజల పరస్పర విశ్వాసాన్ని దెబ్బతీసి, దేశ ఐక్యత సమగ్రతలకు చేటు కలిగిస్తుందని చెప్పారు.

ప్రతి సంవత్సరం, సర్దార్ పటేల్ జయంతి నాడైన అక్టోబర్ 31న దేశ ఐక్యత సమగ్రతలను కాపాడతామంటూ ప్రతిన పూనుతామని గుర్తు చేస్తూ.. ఈ ప్రతిజ్ఞ కేవలం ఆనవాయితీగా చేసేది కాదని, పూర్తి నమ్మకంతో చేపట్టే సంప్రదాయమని శ్రీమతి ముర్ము అన్నారు. నిజాయితీతో ప్రతిజ్ఞను పాటించవలసిన ఉమ్మడి బాధ్యత మనపై ఉందని రాష్ట్రపతి అన్నారు.

నైతికతకు పెద్దపీట వేసే భారత దేశంలో డబ్బు, ఆస్తి, వస్తువుల సంపాదనే ధ్యేయంగా జీవన స్థాయిని పెంచుకునేందుకు తంటాలు పడే కొందరు... ఈ సూత్రానికి దూరమవుతూ అవినీతికి పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కనీన అవసరాలు తీర్చుకున్నాక ఆత్మ గౌరవంతో బతకడంలోనే నిసలైన సంతోషం దాగుందని అన్నారు.

నిబద్ధతతో చేపట్టిన ఏ పనికైనా విజయం లభించడం తథ్యమని రాష్ట్రపతి అన్నారు.

భారతదేశానికి అపరిశుభ్రత రాసిపెట్టి ఉందని కొందరు నమ్మినా.. స్థిరమైన నాయకత్వం, ప్రభుత్వ పట్టుదల, పౌరుల భాగస్వామ్యాలు ఈ పరిస్థితిలో స్పష్టమైన మార్పు తెచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. అవినీతిని రూపుప రూపడం అసాధ్యమనే నిరాశావాదుల తీరు సరైనదిగా చూడలేమన్న రాష్ట్రపతి... 'అవినీతి పట్ల కఠిన వైఖరి'తో మెలగాలన్న ప్రభుత్వ విధానం వల్ల అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించడం సాధ్యపడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడ్డ వారిపై తక్షణమే న్యాయపరమైన చర్యలు తీసుకోవడం అత్యవసరమన్న రాష్ట్రపతి.. ఈ విషయంలో తాత్సారం, లేదా బలహీనమైన చర్యల వల్ల అవినీతిపరులకు ప్రోత్సాహం లభిస్తుందని హెచ్చరించారు. అదే సమయంలో వ్యక్తులనూ, వారి ప్రతి చర్యనూ అనుమానంతో చూడరాదన్న విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలని సూచించారు. వ్యక్తిగత పగతో ఏ ఒక్కరినీ ఇబ్బంది పెట్టడం సబబు కాదనీ, వ్యక్తుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలు తీసుకోరాదని చెప్పారు.

అందరికీ సమానత్వం, సమాన న్యాయం అందించే లక్ష్యంతో పనిచేయాలని శ్రీమతి ద్రౌపదీ ముర్ము హితవు పలికారు.

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న సిఎం రేవంత్ రెడ్డి

యాదాద్రి భువనగిరి నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యమంత్రికి అర్చకులు వేదాశీర్వచనం చేసిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. హైదరాబాద్ నుంచి యాదిగిరిగుట్టకు సిఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చారు. రేవంత్‌రెడ్డి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వలిగొండ మండల సంగెం గ్రామ శివారులోని భీమలింగం కత్వ నుంచి మూసీ నది వెంట సిఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహిస్తారు. భువనగిరి మండలం మీదుగా బొల్లెపల్లి నుంచి వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం కత్వ వద్దకు చేరుకుంటారు. భీమలింగం, ధర్మారెడ్డి కాల్వల్ని సందర్శిస్తారు. అనంతరం మూసీ పరీవాహక ప్రాంత రైతులతో సమావేశం అవుతారు. ప్రభుత్వం మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో మూసీ నది వెంట సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర ప్రాధాన్యత సంతరించుకుంది.

సమగ్ర కుటుంబ సర్వేను చిత్త శుద్ధితో విజయవంతంగా పూర్తి చేయాలి

హైదరాబాద్ నవంబర్ 07 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై నేడు ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ లో సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ సర్వే కు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందని అన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేల చర్యలు చేపట్టాలని సూచించారు.దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం

పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్య పర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటినికూడా వదలకుండా

ఆర్టికల్ 370 పునరుద్దరణ చేసే ప్రసక్తేలేదు - తేల్చి చెప్పిన అమిత్ షా

న్యూఢిల్లీ, నవంబర్ 8:జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించే ఆర్టికల్ 370ని పునరుద్దరించే ప్రసక్తి లేదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. ఆర్టికల్ 370 అంశంపై జమ్ము కశ్మీర్ అసెంబ్లీలో ఈరోజు అధికార ఎన్సీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య తోపులాట జరిగింది. ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలంటూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వం గందరగోళం మధ్యే అసెంబ్లీలో ఆమోదించింది. ఈ నేపథ్యంలో అమిత్ షా స్పందించారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉన్న అమిత్ షా మాట్లాడుతూ తాను శివాజీ పుట్టిన మహారాష్ట్ర గడ్డమీది నుంచి చెబుతున్నానని, నాలుగు తరాలు వచ్చినా ఆర్టికల్ 370ని తిరిగి తీసుకువచ్చే ప్రసక్తి లేదన్నారు. కశ్మీర్ ఇండియాలో భాగం కాదు అనేవా ఆర్టికల్ 370 ఉందని మండిపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు తమ ప్రభుత్వ ఘనవిజయం అని వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దు జమ్ము కశ్మీర్ అభివృద్ధికి దోహదపడిందన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలతో సంబంధాలు మెరుగుపడటానికి దారి తీసిందన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము కశ్మీర్‌లో శాంతి నెలకొందన్నారు. వేర్పాటువాద పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జత కట్టడంపై ఆయన నిప్పులు చెరిగారు.

కేంద్రం రద్దు చేసిన 370వ అధికరణ ను దేశంలోని ఏ శక్తి పునరుద్ధరించ లేదు

-370 అధికరణపై మోదీ స్ట్రాంగ్ వార్నింగ్

ముంబై నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: జమ్మూకశ్మీర్ లో కేంద్రం రద్దు చేసిన 370వ అధికరణ ను దేశంలోని ఏ శక్తి పునరుద్ధరించ లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెగేసి చెప్పారు. కేంద్ర పాలిత ప్రాంతంలో (జమ్మూకశ్మీర్) కాంగ్రెస్ పార్టీ కుట్రలను మహారాష్ట్ర ఓటర్లు గుర్తించాలని హెచ్చరించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధులేలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మోదీ శుక్రవారంనాడు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ ఎజెండాను, కశ్మీర్‌లో వేర్పాటువాద భాషను ఇక్కడ కూడా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలను ఓటర్లు తిప్పికొట్టాలన్నారు. జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే 370వ అధికరణను తిరిగి పునరుద్ధరించాలంటూ రెండ్రోజుల క్రితం అక్కడి అధికార 'ఇండియా' కూటమి అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిన నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ కుట్రలను మహారాష్ట్ర ప్రజలు అవగాహన చేసుకోవాలని, 370వ అధికరణపై అక్కడి అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని దేశం అంగీకరించిందని అన్నారు. ఏ శక్తి కూడా ఆ అధికరణను వెనక్కి తేలేదని స్పష్టం చేశారు. "370వ

అధికరణకు మద్దతుగా అసెంబ్లీ వెలుపల బ్యానర్లు పెట్టారు. ఆ అధికరణను పునరుద్ధరించాలంటూ కాంగ్రెస్ కూటమి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.. దీనిని దేశ ప్రజలు ఆమోదిస్తారా? ఈ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు శక్తవంచన లేకుండా నిరసన తెలిపినప్పటికీ వారిని అసెంబ్లీ నుంచి బయటకు పంపించేశారు. కాంగ్రెస్ కూటమి నిజస్వరూపం ఏమిటో యావద్దేశం అవగాహన చేసుకోవాలి" అని మోదీ అన్నారు.

నేను ఉన్నంత వరకూ.. 370వ అధికరణను పునరుద్ధరించేందుకు దేశ ప్రజలు అంగీకరించరని, కశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆటలు మోదీ ఉన్నంత వరకూ సాగవని ప్రధాని అన్నారు. బీమ్‌రావ్ అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే అక్కడ నడుస్తుందని, ఏ శక్తీ 370వ అధికరణను వెనక్కి తేలేదని మరోసారి ఆయన స్పష్టం చేశారు. విపక్ష సభ్యులు తీవ్ర ప్రతిఘటన, నిరసనల మధ్య జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో 370వ అధికరణను పునరుద్ధరించే తీర్మానాన్ని గత శుక్రవారంనాడు మూజువాణి ఓటుతో ఆమోదించారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

హైదరాబాద్, నవంబర్ 8: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 471 దరఖాస్తులు అందాయి. బీసీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 156, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 87, విద్యుత్ శాఖ కు సంబంధించి 75, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 50 ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 04, ఇతర శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పాక్ కొత్త చరిత్ర.. ఆసిస్ పై ఘన విజయం !

న్యూఢిల్లీ, నవంబర్ 8:ఆతిథ్య ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు (శుక్రవారం) జరిగిన రెండో వన్డేలో పాకిస్థాన్ విజయం సాధించింది. ఆసీస్ గడ్డపై పాక్ ఏడేళ్ల తర్వాత తొలిసారి ఓ వన్డేలో విజయం సాధించింది. 2017 జనవరి 15న పాక్ చివరిసారి ఆసీస్‌ను వారి సొంతగడ్డపై (మెల్‌బోర్న్) ఓ వన్డేలో ఓడించింది.

కాగా, నేటి మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 35 ఓవర్లలో 163 ??పరుగులకే కుప్పకూలింది. పాకిస్థాన్ స్టార్ పేసర్ హారీస్ రవూఫ్ (5/29) ఐదు వికెట్ల చెలరేగడంతో.. ఆసీస్ పతనానికి దారితీసింది. షాహిన్ షా ఆఫ్రిది (3/26) మూడు వికెట్లు తీయగా.. నసీమ్ షా, మహ్మద్ హస్నైన్ తలా ఒక వికెట్ తీశారు.

పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, నవంబర్ 8: తెలంగాణ పదో తరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపులకు సంబంధించిన షెడ్యూల్‌ను గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ విడుదల చేశారు.

ఈ నెల 18వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. రూ. 50 ఆలస్య రుసుంతో డిసెంబర్ 2వ తేదీ వరకు, రూ. 200 ఆలస్య రుసుంతో డిసెంబర్ 12 వరకు, రూ. 500 ఆలస్య రుసుంతో డిసెంబర్ 21వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారు.

రెగ్యులర్ విద్యార్థులు అన్ని పేపర్లకు కలిపి రూ. 125, మూడు లేదా అంతకంటే తక్కువ పేపర్లు ఉన్న వారు రూ. 110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ. 125 చెల్లించాల్సి ఉంటుంది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సుప్రీం ధర్మాసనం వీడ్కోలు

న్యూ డిల్లీ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్):భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆయన ఈనెల 10న పదవీ విరమణ చేయనున్నారు. అయితే, శని, ఆదివారాల్లో కోర్టుకు సెలవులు. దీంతో ఆయనకు ఇవాళ లాస్ట్ వర్కింగ్ డే కావడంతో సుప్రీం ధర్మాసనం వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తిగా చివరి సందేశం ఇచ్చారు. వృత్తి పరంగా తాను పూర్తి సంతృప్తిగా ఉన్నానన్నారు. 'రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవం.. అయినప్పటికీ నేను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నాను' అని తెలిపారు. కాగా, సీజేఐ చంద్రచూడ్ 2022 నవంబర్ 8 నుంచి ఈ పదవిలో ఉన్న విషయం తెలిసిందే.

సీజేఐగా చివరి తీర్పు..

కాగా, జస్టిస్ డీవై చంద్రచూడ్ తన లాస్ట్ వర్కింగ్‌డే రోజు అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ కి మైనార్టీ హోదా విషయంలో కీలక తీర్పు వెలవరించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నాలుగు రకాల తీర్పులను వెలువరించింది. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నాయకత్వంలోని ఏడుగురు ధర్మాసనం ఈ తీర్పుల గురించి తెలిపింది. ఏఎంయూ కేసులో నాలుగు రకాల అభిప్రాయాలు ఏర్పడ్డాయని, దీంట్లో మూడు రకాల వ్యతిరేక తీర్పులు ఉన్నట్లు సీజే చంద్రచూడ్ తెలిపారు. మెజారిటీ తీర్పు తనతో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రా రాసినట్లు సీజే వెల్లడించారు. జస్టిస్ సూర్యకాంత్, దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మలు సపరేట్ తీర్పులను ఇచ్చినట్లు జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినా.. ఆ విద్యాసంస్థకు ఉన్న మైనార్టీ హోదాను రద్దు చేయరని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పార్లమెంట్ చట్టంతో అలీఘడ్ ముస్లిం వర్సిటీ మైనార్టీ హోదా రద్దు అయినట్లు 1968లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టిపారేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. అడ్మిని

స్ట్రేషన్‌లో మైనార్టీ సభ్యులు లేనంత మాత్రాన.. ఆ వర్సిటీ మైనార్టీ హోదా పోదు అని సుప్రీంకోర్టు చెప్పింది.

లీగల్ సర్వీసెస్ అథారిటీలు - పేదలకు ఉచిత న్యాయ సేవలు !

(09 నవంబర్ జాతీయ న్యాయ సేవల దినం" సందర్భంగా)

భారత దేశవ్యాప్తంగా బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేసిన లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆక్ట్ 1987 తీసుకురావడం జరిగింది. ఈ చట్టం 09 నవంబర్ 1995 నుంచి అమలులోకి రావడంతో ఆ రోజు ప్రత్యేకతను గుర్తించిన ప్రభుత్వం ప్రతి ఏట 09 నవంబర్‌న "జాతీయ న్యాయ సేవల దినం లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ఈ చట్టం ద్వారా జాతీయ స్థాయిలో "నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా జాతీయ న్యాయ సేవల అథారిటీ, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నాయకత్వంలో "రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ(స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)", జిల్లా స్థాయిలో "జిల్లా న్యాయ సేవల అథారిటీ(డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ)" ఆయా ప్రాంతాల బడుగు బలహీన వర్గాలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తూనే అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట జరుగుతున్నది.

చట్టం ముందు అందరూ సమానమే:

న్యాయ దేవత, చట్టం ముందు అందరూ సమానమే. ఉన్న వారికి ఒక న్యాయం, లేని వారికి మరో న్యాయం అందుకున్న అకాలమిది. చేసే వారికి తగు శిక్షలు తక్షణమే పడాలి. న్యాయం కావాలని కోర్టులో కేసులు పట్టడం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం అని మనందరికీ తెలుసు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కలేదని నిరుపేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయం అందించడం, న్యాయ సంబంధ అవగాహనలు నిర్వహించడం, మైనారిటీ/ఎస్‌సి/ఎస్టీ/మహిళలు/పిల్లలు/మానవ అక్రమ రవాణా విషవలలో చిక్కిన వారికి ఉచితంగా న్యాయ సేవలు లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా అందించడం జరుగుతోంది. న్యాయ హక్కుల పట్ల సరైన అవగాహన లేని సమాజంలో మనం ఉన్నాం. పేదలకు సహితం న్యాయమైన హక్కులు అనుభవించే అవకాశం ఇవ్వడమే న్యాయ సేవల అథారిటీ లక్ష్యంగా తీసుకోబడింది. క్షేత్ర స్థాయిలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తూ, సమస్యలకు పరిష్కారాలు అక్కడికక్కడే అందించే ప్రయత్నాలు ఈ అథారిటీల ద్వారా జరుగుతున్నాయి.

జాతీయ స్థాయి నుంచి తాలూకా స్థాయి వరకు ఉచిత న్యాయ సేవల అథారిటీలు:

దేశవ్యాప్తంగా సుప్రీమ్ కోర్టు స్థాయిలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైకోర్టుల పరిధిలో 39 హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 37 స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 673 డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీలు, 2465 తాలూకా స్థాయి లీగల్ సర్వీసెస్ అథారిటీలు ఉచిత న్యాయ సేవలను బలహీన వర్గాలకు అందిస్తున్నాయి. లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా ఉచిత న్యాయ సేవలు, లీగల్ రైట్స్ పట్ల అవగాహనలు, న్యాయన్ని వేగంగా అందించడం, పేదలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావడం, కోర్టు మెట్లు ఎక్కకుండానే న్యాయం పొందగలగడం, లోక్ అదాలత్‌లను నిర్వహించి సత్వరమే కేసులను పరిష్కరించడం లాంటి మహత్తర కార్యాలను న్యాయ సేవల అథారిటీలు నిర్వహిస్తున్నాయి.

అందరికీ సరైన న్యాయం సమానంగా అందాలి. ఆర్థికంగా చితికిన బడుగుల చెంతకు న్యాయ సేవలు ఉచితంగా అందించబడాలి. చట్టం ముందు తరతమ భేదాలు ఉండకూడదు. కోర్టుల్లోకి చేరి దశాబ్దాలుగా కోర్టుల్లో కేసులు పొడిగించబడి కుటుంబాలు చితికి పోకూడదు. న్యాయం అందడానికి సమయం పట్టకూడదు. ఆలస్యంగా న్యాయం అందినా అది అన్యాయమే అవుతుందని గమనించి ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఆశ్రయించి సత్వర న్యాయం పొందాలని ఆశిద్దాం, కోర్టు మెట్లెక్కని రోజులు రావాలని కోరుకుందాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పరిశోధన, అభివృద్ధి అంశాలపై ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను ఆహ్వానించిన భారత ప్రభుత్వం

న్యూఢిల్లీ, నవంబర్ 8:నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డి) పథకం పరిధిలో ఎక్స్‌లెన్స్ సెంటర్ల (సీఓఈ)ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సమర్పించాల్సిందిగా భారత ప్రభుత్వం కోరింది. నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎమ్ఎన్ఆర్ఈ) ఈ నెల 4న ప్రతిపాదనలను సమర్పించాల్సిందిగా కోరింది.

భారత్ లో దీర్ఘ కాలం పాటు గ్రీన్ హైడ్రోజన్ సంబంధిత నూతన ఆవిష్కరణలను కొనసాగించడానికీ, గ్రీన్ హైడ్రోజన్ వినియోగాన్ని ప్రోత్సహించడానికీ, ఇంధన వాడకం పరంగా మన దేశం స్వతంత్ర వైఖరిని అవలంబించడానికీ ఈ ప్రపంచ శ్రేణి ఎక్స్ లెన్స్ సెంటర్లను (సీఓఈస్) ను స్థాపించ తలపెట్టారు. గ్రీన్ హైడ్రోజన్ ను ఉత్పత్తి చేయడాన్ని, గ్రీన్ హైడ్రోజన్ ను నిల్వ చేయడాన్ని, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీని ప్రోత్సహించే వాతావరణంలో కార్బన్- డై- ఆక్సైడ్ పాళ్ల స్థాయిని తగ్గించడానికి ప్రాధాన్యాన్ని కట్టబెట్టే ఆర్థిక వ్యవస్థ ను ఆవిష్కరించే ప్రక్రియను ఈ సీఓఈస్ లు వేగవంతం చేయనున్నాయి.

అత్యాధునిక పరిశోధనలను, నైపుణ్యాభివృద్ధిని, సమాచార వ్యాప్తినీ ఈ సీఓఈ స్ లు ముఖ్య లక్ష్యాలుగా పెట్టుకొంటాయి. గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీలలో నూతన ఆవిష్కరణలను ముందుకు తీసుకు పోవడానికి పరిశ్రమ రంగ ప్రముఖులు, విద్యారంగ ప్రముఖులు, ప్రభుత్వం సహా ఆయా ఆసక్తిదారుల మధ్య ఈ సీఈఓస్ లు సమన్వయం చేస్తాయి. దీనితో కొత్త కొత్త ఉత్పాదనల ఆవిష్కరణకు, సమర్థ ప్రక్రియల రూపకల్పనకు మార్గం ఏర్పడుతుంది. గ్రీన్ హైడ్రోజన్ అనుకూల వాతావరణాన్ని దేశం అంతటా విస్తరించడానికి ఈ కేంద్రాలు అందుబాటులో ఉన్న వనరులను, ఒక చోటుకు చేర్చి, తత్సంబంధిత నైపుణ్యాన్ని ఉపయోగించుకోనున్నాయి.

నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) పథకాన్ని అమలులోకి తీసుకు రావడానికి కొన్ని మార్గదర్శక సూత్రాలను నూతన పునరుత్పాదక ఇంధన శాఖ (ఎమ్ఎన్ఆర్ఈ) ఇంతకు ముందే, అంటే గత మార్చి నెలలో 15వ తేదీన విడుదల చేసింది.

ప్రతిపాదనల ఆహ్వానాన్ని (అటఖ)ని పరిశీలించి ప్రతిపాదనలను దాఖలు చేయడానికి వివిధ పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు భాగస్వామ్యాలను ఏర్పరచుకొనేందుకు అవకాశం ఉంది. ఆ తరహా కేంద్రాలను గ్రీన్ హైడ్రోజన్ మిషన్ లో భాగంగా నెలకొల్పడానికి ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది.

నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ను కిందటి సంవత్సరంలో జనవరి 4న ప్రారంభించారు. ఈ మిషన్ కు ఆర్థిక సంవత్సరం (ఎఫ్ వై) 2029-30 వరకూ రూ.19,744 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలు స్వచ్ఛ ఇంధనం దిశగా మరలడానికి ప్రేరణను అందించి భారతదేశం స్వయం సమృద్ధ దేశం (ఆత్మ నిర్భర్)గా నిలిచే లక్ష్య సాధనకు నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ తన వంతు సహకారాన్ని అందించనుంది. ఈ మిషన్ శిలాజ జనిత ఇంధనాల దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గిస్తూ... వాతావరణంలోని కర్బన ఉద్గారాలను చెప్పుకోదగిన స్థాయికి తగ్గిస్తూ, గ్రీన్ హైడ్రోజన్ విపణిలో నాయకత్వ స్థానాన్ని సంపాదించడానికి అవసరమైన టెక్నాలజీని భారతదేశం అందిపుచ్చుకోవడానికి నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ తోడ్పడనుంది.

ఐఎన్ఎస్ విక్రాంత్‌లో భారత నావికదళ కార్యకలాపాలను వీక్షించిన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, నవంబర్ 8:సముద్రంలో భారత నావికా దళ కార్యాచరణ ప్రదర్శనను గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గురువారం వీక్షించారు. ఐఎన్ఎస్ హన్సా (గోవా నావిక దళ ఎయిర్ స్టేషన్)కు విచ్చేసిన రాష్ట్రపతికి నావికదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠితోపాటు పశ్చిమ నావిక దళం ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ ఎడ్మిరల్ సంజయ్ జె. సింగ్ స్వాగతం పలికారు. ఆమె రాక సందర్భంగా 150 మందితో కూడిన సైనిక బృందం గౌరవ వందనం సమర్పించింది.

అనంతరం భారత నావిక దళానికి చెందిన 15 ప్రధాన యుద్ధ నౌకలు, జలాంతర్గాములతో కూడిన, దేశీయంగా రూపొందించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ను గోవా సముద్ర తీరంలో గౌరవ రాష్ట్రపతి ప్రారంభించారు. రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము సముద్రంలో భారత నావికాదళ నౌకలను సందర్శించడం ఇదే మొదటిసారి. నావిక దళం నిర్వహించే పాత్ర, కార్యాచరణ, పనితీరు తదితర అంశాలను ఈ సందర్భంగా రాష్ట్రపతికి అధికారులు వివరించారు. అనంతరం రాష్ట్రపతి పలు నావిక దళ కార్యకలాపాలను వీక్షించారు. ఓడ తలం మీది నుంచి యుద్ధ విమానాలు పైకెగరడం, దిగడం, యుద్ధ నౌక నుంచి క్షిపణి ప్రయోగ విన్యాసాలు, జలాంతర్గామి కార్యకలాపాలు, 30కి పైగా ప్రత్యేక విమానాలను రాష్ట్రపతి పరిశీలించారు. చివరిగా, గతంలో ఆవిరితో నడిచే సాంప్రదాయక యుద్ధ నౌకలను వీక్షించారు.

మధ్యాహ్న భోజన సమయంలో రాష్ట్రపతి ఐఎన్ఎస్ విక్రాంత్ సిబ్బందితోనూ సంభాషించారు. అనంతరం నావికా దళాన్ని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. అన్ని విభాగాలకూ ఆమె ప్రసంగాన్ని ప్రసారం చేశారు

ప్రతీ ధాన్యం గింజ కొంటాం- రైతులకు మంత్రి అచ్చెన్న భరోసా

-17 నుంచి దాన్య సేకరణ

-అన్ని జిల్లాల్లో వడ్ల కొనుగోళ్ల కేంద్రాలు

శ్రీకాకుళం, నవంబర్ 8: శ్రీకాకుళం జిల్లాలో ఈనెల 17వ తేదీ నుండి రైతులు పండించే ధాన్యాన్ని సేకరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శాసన సభ్యులతో కలిసి శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ? రానున్న మూడు, నాలుగు నెలలు ఛాలెంజ్ గా తీసుకొని ప్రతీ ధాన్యం గింజ రైతుల నుండి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ధాన్య సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ధాన్యం సేకరణ ఒక పద్ధతి, విధానంలో సేకరించాలన్నారు. ఒరిస్సా నుండి ధాన్యం రాకుండా నివారించాలని ఆదేశించారు. గత ఐదు సంవత్సరాలుగా ధాన్యం సేకరణ సక్రమంగా జరగలేదన్నారు. జిల్లాలో కొన్నిరైస్ మిల్లులను పక్కన పెట్టేవారని, అలాంటి వాటికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. ప్రైవేటు ఆర్గనైజేషన్ వారు కొనుగోలు చేస్తే అలాంటి వారు గతంలో వారు ఏ విధంగా సేకరించింది పరిశీలించాలన్నారు. మార్కెటింగ్, పీఏసీఎస్ లు, స్వయం సహాయక సంఘాల ద్వారా సేకరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణ కేంద్రాలు ఎన్ని ఉండాలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా ఉండకూడదని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు నిబంధనలు ఎలాంటి నియమ, నిబంధనలు ఉండవన్నారు. రైతులు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయాలు చేసుకోవచ్చని వెల్లడించారు. గత ఐదు సంవత్సరాలుగా ఏ రైస్ మిల్లు ఎంత ధాన్యాన్ని సేకరించిందో ఆ వివరాలను తెలపాలన్నారు. రైతు పండించిన ప్రతీ గింజ ప్రభుత్వం సేకరిస్తుందని చెప్పారు. రీ సైక్లింగ్ చేయాలన్నారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరికి ఏ బాధ్యత అప్పగిస్తే ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వాస్తవాలను తెలుసుకొని ముందుకు వెళదామన్నారు. ధాన్యం సేకరణ ఒక ప్రస్టేజిగా తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. జిల్లా రైతులు తడి ధాన్యాన్ని తీసుకు రాకూడదని, ధాన్యం తడిగా ఉంటే ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని రైతులను ఆయన కోరారు. ఏ ఒక్క గింజ వదిలి పెట్టమన్నారు. గ్రేడ్ ఎ ప్రమోట్ చేయాలన్నారు. బ్యాంకర్లు గ్యారంటీలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ 17వ తేదీ నాటికి బ్యాంకలన్ని గ్యారంటీలు సిద్ధం చేసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ ఈ నెల 17 నుండి సేకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. కస్టోడియన్ ఆఫీసర్లుగా సి.యన్ డీటీలను నియమిస్తామన్నారు. ఈ సమావేశంలో శాసన సభ్యులు గొండు శంకర్, నడికుదిటి ఈశ్వరరావు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఆర్డీఓలు కె. సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, డి.వెంకటేశ్వరరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథ స్వామి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్య కిరణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం.. కేంద్ర మంత్రి పెమ్మసాని

-నూతన ఆవిష్కరణలతో ముందుకు రండి

-మోదీ, చంద్రబాబు విజనరీతో దేశంలో సుస్థిర అభివృద్ధి

-వికాస్ - 2024 సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

అమరావతి, నవంబర్ 8:సమాజానికి దోహదపడే నూతన ఆవిష్కరణలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్

పెమ్మసాని చంద్రశేఖర్. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి లీడర్ల విజనరీతో భారత దేశంలో స్టార్టప్ లకు గొప్ప అవకాశాలు ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోనూ దాగి ఉన్న ప్రతిభావంతులను వెలికితీసి, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తున్నామని అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన వికాస్ ? 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెమ్మసాని పాల్గొని మాట్లాడారు.

2024 ముందు భారతదేశంలో కేవలం అతి తక్కువ సంఖ్యలో స్టార్టప్ లు ఉండేవని, ప్రస్తుతం 1.12 లక్షల స్టార్టప్ కంపెనీలు ఉన్నాయని అన్నారు. యూనికాన్స్ నాలుగు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 1100 ఉన్నాయని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. భారతదేశం జనాభా, పేదరికం, స్థానిక పరిస్థితుల ఆధారంగానే జీడీపీ ఆధారపడి ఉంటుందని, ప్రజల జీవనోపాధులు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇండియాలో సుస్థిరమైన ప్రగతి కోసం వికసిత్ భారత్, వికాస్ వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు.

తాను నిర్వహిస్తున్న కమ్యూనికేషన్స్, రూరల్ డెవలప్ మెంట్ శాఖల్లో స్టార్టప్ లను ప్రోత్సహిస్తానని స్పష్టం చేశారు. నరేంద్ర మోదీగా ఆశయాలతోనే భారతదేశం పదేళ్ల కాలంలో ఆదర్శవంతమైన అభివృద్ధి సాధించిందని అన్నారు . మోదీ దేవుడిచ్చిన వరమని పేర్కొన్నారు. నూతన ఆలోచనలతో ముందుకు వెళితే తనకులాగా విజయాలు సాధించవచ్చని పెమ్మసాని తెలిపారు.

ఎంసెట్ లో తాను 27 ర్యాంక్ సాధించానని, తనకంటే 26 మంది ముందున్నా కానీ, తన ఆలోచనలు విస్తృతం చేయడం ద్వారా సక్సెస్ సాధించానని పేర్కొన్నారు. ఇది యువతకు ఆదర్శం కావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు పారిశ్రా మికవేత్తలతో చర్చించిన పెమ్మసాని అనంతరం యూనివర్సిటీ విద్యార్థులతో మాట్లాడారు స్టార్ట్ అప్స్ పై విద్యార్థులకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు.

కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, ఛాన్స్ లర్ జి విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ ఎస్ వి. కోటా రెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ సి. ముదిగంటి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నుంచి డోన్‌కు .. ఆఘోరి నాగసాధు

అమరావతి, నవంబర్ 8: కర్నూలు లో ఆఘోరి హల్ చల్ చేసింది. కారు చేడిపోవడంతో ఓ కారు షోరూంలో రిపేరికి ఇచ్చి అక్కడి నుంచి డోన్ జాతీయ రహదారి వైపు ఆఘోరి నాగసాధు నడుచుకుంటూ వెళ్లారు. ఆఘోరి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండడంతో కొంతమంది ప్రజలు పెద్ద సంఖ్యలో తమ వాహనాలు ఆపి ఆసక్తిగా చూస్తూ కనిపించారు.మరికొందరు అఘోరికి పాద నమస్కారం చేసేందుకు పోటీపడ్డారు. కాళహస్తి, ఆళ్లగడ్డ, నంద్యాల మీదుగా అఘోరి కర్నూలు చేరుకున్నారు.

ఏపిలో విషాదం .. వాగులో మునిగి నలుగురు మృతి

అమరావతి, నవంబర్ 8: ఇసుక కోసం వాగులోకి దిగి నలుగురు యువకులు మరణించిన విషాద ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏజెన్సీలో చోటుచేసుకుంది. జిల్లాలోని అడ్డతీగల మండలం తిమ్మాపురంలో ఈ విషాద ఘటన జరిగింది. వాగులో నుంచి ఇసుక తీస్తుండగా ఒక్కసారిగా లోతులోకి వెళ్లి ఊబిలో కూరుకుపోయాడు భూషణం. దీంతో అతడిని అతడిని కాపాడేందుకు వెళ్లిన బాబు, గొంతయ్య, శ్రీను కూడా వాగులో మునిగి మరణించారు.

మృతుల్లో తండ్రి కొడుకులు కూడా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే వీరంతా ఏలేరుకు చెందినవారుగా గుర్తించారు పోలీసులు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టంకు పంపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని..

దేవస్థానం ప్రత్యేక అధికారిగా చంద్రశేఖర్ ఆజాద్

శ్రీశైలం , నవంబర్ 8:శ్రీశైల దేవస్థానానికి ప్రత్యేక అధికారిగా ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్‌ను నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు బదిలీ కావడంతో దేవస్థాన సహాయ కమిషనర్ ఇ.చంద్రశేఖరరెడ్డికి ప్రభుత్వం ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతలు అప్పగించింది.

అయితే ప్రస్తుతం శ్రీశైలంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తుండడంతో వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా చంద్రశేఖర్ ఆజాద్ ను నియమించారు. ఆజాద్ దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్‌గా ప్రస్తుతం పనిచేస్తుండడం గమనార్హం. ఇక శ్రీశైలంలో ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని కూడా దేవాదాయశాఖ శ్రీశైలంకు ప్రత్యేక అధికారిని నియమించడం విశేషం.

వజ్ర రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టివేత

నిజామాబాద్, నవంబర్ 8: నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్ రైస్‌మిల్లులో భారీగా పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేశారు. స్థానికంగా ఉన్న వజ్ర రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కాగా.. ఇప్పటి వరకు 500 క్వింటాళ్ల పైచిలుకు బియ్యాన్ని గుర్తించారు.

మొత్తం 700 క్వింటాళ్లు పైబడి ఉంటుందని సమాచారం. గతంలోనూ ఇదే మిల్లులో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించగా పెద్దమొత్తంలో పీడీఎస్ బియ్యం పట్టుబడింది. అయినా మిల్లు యజమాని తీరు మార్చుకోలేదు. దర్జాగా పీడీఎస్ రీసైక్లింగ్ నిర్వహించడం గమనార్హం.

బిఆర్ఎస్..కాంగ్రెస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉంది

– కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్): బిఆర్ఎస్..కాంగ్రెస్ పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని..అందుకే కెటిఆర్‌ను అరెస్ట్ చేయడంలేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం హంగామా చేసిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శలు గుప్పించారు.

జన్వాడ ఫామ్‌హౌస్ కేసులో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు రాజీ పడ్డాయని ఆరోపణలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బిజెపికి తావులేకుండా చేయాలని కాంగ్రెస్, బిఆర్ఎస్ కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పార్టీ అనేది ఇప్పుడు లేదని, ఇక ముందు కూడా ఉండదని తెలియజేశారు.ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీకి బిఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకడం లేదని, బిఆర్ఎస్‌లో కెసిఆర్ కుమారుడు కెటిఆర్‌ను ఎవరు పట్టించుకోవడంలేదని బండి సంజయ్ కుమార్ చురకలంటించారు. బిఆర్ఎస్‌లో విశ్వసనీయత ఉన్న నాయకుడు ఎంఎల్ఎ హరీష్ రావు అని, రేవంత్ బిడ్డ పెళ్లికి వెళ్లకుండా ఆయనను జైలు పంపారు గుర్తుందా? సిఎంను నిలదీశారు. జైలుకు పంపిన వారితో రాజీ పడుతున్నారా? అని ప్రశ్నించారు. రేవంత్, కెటిఆర్ మధ్య రహస్య ఒప్పందం ప్రకారం కెటిఆర్‌ను అరెస్ట్ చేయడంలేదన్నారు. రేవంత్, బండి సంజయ్ ఒక్కటేనని బిఆర్ఎస్ ప్రచారం చేయడంపై మండిపడ్డారు. తాను, రేవంత్ ఒక్కటేనని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెప్పాలని బండి సంజయ్ కుమార్ అడిగారు.

పీఆర్సీ విషయంలో సర్కార్ నిర్లక్ష్యం వద్దు.. సదానందం గౌడ్

హైదరాబాద్, నవంబర్ 8:ప్రభుత్వం పీఆర్సీ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఎస్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ కోరారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణంలో ఎస్ టి యుటి ఎస్ భవనంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ టి యు టి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1.7.2023 నుండి రావాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఊపిరిగా ఎస్టీయూటీఎస్ గత 77 సంవత్సరాలుగా పోరాడుతుందని తెలిపారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రిలో పనిచేసే విధంగా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, 317 జీవో బాధిత ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి సొంత జిల్లాలకు కేటాయించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటును అందిస్తూ జీవో విడుదల చేయడం పట్ల ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర బాధ్యులు కృష్ణారెడ్డి, కరుణాకర్ రెడ్డి ,పోల్ రెడ్డి, రవి, రామ సుబ్బారావు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇస్తేకార్, సిద్దిపేట్ జిల్లా అధ్యక్షులు భూపాల్ ఏఐఎస్టిఎఫ్ సభ్యులు కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి, పరమేశ్వర, ప్రవీణ్ కుమార్, పాండు ,సుధాకర్, బాలనరసింహులు, సుదర్శన్ రెడ్డి, ఆమనగల్ మండల అధ్యక్షులు, కసిరెడ్డి అశోక్ రెడ్డి, నవీన్ కుమార్, సూర్పి, విగ్నేశ్వర, శ్రీనివాస్, తదితరులున్నారు.

బాలికల అక్రమ రవాణా.. బలవంతంగా వ్యభిచారం కేసు ఆరుగురికి జీవిత ఖైదు

హైదరాబాద్ నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బంగ్లాదేశ్ బాలికలను అక్రమంగా తరలించి బలవంతంగా వ్యభిచారంలోకి దింపిన 2019 మా నవ అక్రమ రవాణా కేసులో హైదరాబాద్‌లో ని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) ప్రత్యేక కోర్టు మొత్తం ఆరుగురు నిందితులను దోషులుగా నిర్ధారించి, జీవిత ఖైదు విధించింది. నిందితులు మహ్మద్ యూసుఫ్ ఖాన్, అతని భార్య బితీ బేగం, సోజిబ్, రుహుల్ అమీన్ ధాలీ, మహ్మద్ అబ్దుల్ సలామ్ అలియాస్ కౌన్లా జస్టిన్, షీలా జస్టిన్ అలియాస్ షియు లీ ఖాతున్‌లు అనైతిక ట్రాఫికింగ్ నిరోధక చట్టం, 1986, ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద దోషులుగా తేలారని ఎన్ఐఎ పేర్కొంది. ఆ రుగురు నిందితులలో ధాలీని పశ్చిమ బెంగాల్‌లో అరెస్టు చేయగా, మిగతా వారిని 2019 20020 మధ్య తెలంగాణలో అరెస్టు చేశా రు. బుధవారం తన తీర్పులో ప్రత్యేక కోర్టు మొత్తం ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు,రూ. ఒక్కొక్కరికి 24,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించడంలో విఫలమైతే, నింది డికి అదనంగా 18 నెలల సాధారణ జైలు శిక్ష పడుతుంది. మంచి జీతంతో కూడిన ఉద్యోగాలు ఇప్పిస్తానని బంగ్లాదేశ్‌కు చెందిన బాలికలను ప్రలోభపెట్టి, భారత్‌కు అక్రమంగా నిందితులు రవాణా చేశారని, ఆ తర్వాత వారిని వ్యభిచారంలోకి దింపారని ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఆగస్టు 2019లో జరిగిన ఆపరేషన్‌లో హైదరాబాద్‌లోని ఉప్పుగూడలోని కందికల్ గేట్ ప్రాంతంలోని ఓ ఇంటి నుంచి ఐదుగురు బాలికలను రక్షించిన తర్వాత ఛత్రినాక పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. 2019 సెప్టెంబర్ 17న కేసును మళ్లీ నమోదు చేస్తూ దర్యాప్తును ఎన్ఐఎ చేపట్టింది. 2020 మార్చి 10న నలుగురిపై ఎన్ఐఎ చార్జిషీట్‌ను దాఖలు చేసింది, ఆ తర్వాత ఆగస్టు 2020లో మిగిలిన ఇద్దరిపై అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది

టీటీడీ తరహా పాలక మండలి బోర్డు - ఇక యాదాద్రి 'యాదగిరి గుట్ట' ..

యాదాద్రి భువనగిరి నవంబర్ 8:,టీటీడీ తరహాలో యాదగిరి గుట్ట ఆలయ పాలక మండలి బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడకు వచ్చిన ఆయన యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీటీడీ స్థాయిలో బోర్డుకు ప్రాధాన్యం ఉండేలా ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు పూర్తి అధ్యయనం చేసి ఏర్పాటు చేస్తామన్నారు.

యాదగిరి గుట్టగా మార్పు

యాదాద్రిని యాదగిరి గుట్టగా పేరు మార్పు చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అన్నిరికార్డుల్లో ఇక నుంచి యాదగిరి గుట్టగా వ్యవహరించాలని ఆదేశించారు. గోశాలలో గోసంరక్షణకు ఒక ప్రత్యేక పాలసీని తీసుకురావాలని అధికారులకు సూచించారు. గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

కొండపై భక్తులు నిద్రచేసేలా చర్యలు

యాదగిరిగుట్ట వచ్చిన భక్తులు రాత్రి కొండపై నిద్ర చేసి ఉదయం మొక్కులు తీర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. గతంలో కొండపై నిద్ర చేసేందుకు భక్తులకు అవకాశం లేదని గుర్తు చేశారు.

కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్న ఆదేశించారు.

భూసేకరణ పూర్తి చేయాలి

ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్ లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలన్న సీఎం ఆదేశించారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మరో వారంరోజుల్లో పూర్తి వివరాలు, ప్రపోజల్స్ తో రావాలని సూచించారు.

ఆలయానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి రిపోర్ట్ ఇవ్వాలన్నారు.

కార్ రేసింగ్‌తో తెలంగాణకు ఏం లాభం - కేటీఆర్‌ను నిలదీసిన మంత్రి పొంగులేటి

-తప్పు చేస్తే కేసీఆర్‌తో సహా అందరూ శిక్ష అనుభవించాల్సిందే

-రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన

ఖమ్మం, నవంబర్ 7: కార్ల రేసింగ్‌తో తెలంగాణకు వచ్చిన ప్రయోజనం ఏంటి.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై రెవెన్యూ, ఐ అండ్ పీఆర్, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తప్పు చేసిన ఏ నాయకుడైనా శిక్ష అనుభవించక తప్పదని తేల్చి చెప్పారు. తప్పులు చేసినవారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. ఖమ్మం రూరల్ మండలం కోట నారాయణపురంలో సమగ్ర కుటుంబ సర్వేని పొంగులేటి ప్రారంభించారు. కేక్ కట్ చేసి సమగ్ర కుటుంబ సర్వేని, పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత ఎవరైనా సరే తప్పు చేసినట్టు తేలితే శిక్ష తప్పదని వార్నింగ్ ఇచ్చారు. కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తామని తెలిపారు. తప్పులు చేసినవారు భుజాలు తడుముకుంటున్నారని మండిపడ్డారు.

రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం

ఎన్నికల ముందు కులగణన చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు.

75 కాలమ్స్ తో కులగణన సర్వే చేస్తున్నారని తెలిపారు. ఆర్థికంగా భారమైన కులగణన క్షుణ్ణంగా చేస్తామన్నారు.

పూర్తి స్థాయిలో ఈరోజు నుంచే సర్వే మొదలైందని మంత్రి క్లారిటీ ఇచ్చారు. సమగ్ర కుటుంబ సర్వేతో ఎవరికి ఏమేం అవసరం ఉన్నాయో ప్రభుత్వా నికి తెలుస్తుందన్నారు.

ప్రతి ఎన్యుమరేటర్ కి 170 ఇళ్ల వరకు సర్వే చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ చేసిన సర్వేని ఆన్లైన్ లో నమోదు చేస్తారని తెలిపారు.

దేశంలో ఎక్కడైనా కులగణన చేయాలంటే తెలంగాణ రాష్ట్రాన్ని మోడల్ గా తీసుకోవాల న్నారు. కులగణనను అధికారులు బాధ్యతగా నిర్వహించాలన్నారు.

విద్యార్థినులతో కలిసి భోజనం

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం ఆనంతనగర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించారు. అక్కడ విద్యార్థినులతో ఆయన మధ్యాహ్న భోజనం చేశారు.

ఏసీబీ వలలో వర్ని ఎస్సై

-రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

-కొనసాగుతున్న దర్యాప్తు

నిజామాబాద్, నవంబర్ 8: ఏసీబీ వలలో వర్ని ఎస్సై కృష్ణ కుమార్ చిక్కారు. ఓ వ్యక్తి నుంచి రూ.20వేలు లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.నిజామాబాద్ జిల్లా వర్నిలో వివాదం జరిగింది. అందులో ఓ వ్యక్తి తన పేరు ఎఫ్ఐఆర్ లో నమోదు చేయవద్దని ఎస్ఐని కోరాడు. దీంతో రూ.50వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని బాధితుడు చెప్పాడు. రూ.20 వేలు లంచంగా ఇస్తానని చెప్పిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బాధితుడు లంచం ఇస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు.

నిజామాబాద్ జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా అశోక్ బాధ్యతలు

-తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్స్ ట్రక్టర్స్ అసోసియేషన్వన సన్మానం

నిజామాబాద్ నవంబర్ 8(ఎక్స్ ప్రెస్న్యూస్)శ్రీ;నిజామాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అశోక్‌ను శుక్రవారం తెలంగాణ ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్స్ ట్రక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు టీ.కేశవకుమార్, జిల్లా అధ్యక్షులు లింబూరి లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువతో ఘనంగా సన్మానించారు..ఈ సందర్భంగా నిజామాబాద్ డీఈఓగా బాధ్యతలు చేపట్టిన సంధర్భంగ తెలంగాణ ఆర్ట్,క్రాఫ్ట్ ఇన్స్ ట్రక్టర్స్ అసోసిరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.అలాగే గ్రాం ఉద్యోగులుగా పీటీఐ ల సమస్యలను పరిష్కరించాలని, వేతన పెంపుకు కృషి చేయాలని డీఈఓకు విన్నవించారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు

-అన్ని హంగులతో కూడిన స్టేడియం

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

వనపర్తి నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);వనపర్తి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు, వనపర్తి పరిసర ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన క్రీడా ప్రాంగణాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి తెలిపారు. ఈరోజు వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రతిపాదిత క్రీడా ప్రాంగణ నిర్మాణ పనుల పై ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు కోసం దాదాపు 30 ఎకరాల అను వైన భూమిని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపాదిత క్రీడా ప్రాంగణంలో హాకీ మైదానం స్విమ్మింగ్ పూల్,జిమ్ హాల్ తోపాటు ఇతర క్రీడాంశాలకు శిక్షణ ఇచ్చే విధంగా స్టేడియాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు రాష్ట్రంలోనే మెరుగైన క్రీడా శిక్షణ అందే విధంగా అధునాతనమైన సౌకర్యాలతో కూడిన స్టేడియాన్ని నిర్మించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు ,స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ ఇంజనీర్ అశోక్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

ఖమ్మం నగర నాయిబ్రాహ్మణ అధ్యక్షులుగా పోటీ చేయనున్న యలమందల జగదీష్

- నాపూర్తి సహకారం ఉంటది:మంత్రి పొంగులేటి

- నాసోదరుడు యలమందల జగదీష్ ను గెలిపించాలని యావత్ ఖమ్మం నగర నాయి బ్రాహ్మణ సోదరులకి సూచించిన మంత్రి పొంగులేటి

ఖమ్మం, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగర నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడుగా పోటీ చేయుచున్న యలమందల జగదీష్ శుక్రవారం రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటిని వందమందితో కూడిన భారీ బైక్ ర్యాలీతో వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి తమరి ఆశీర్వాదం కావాలని కోరిన వెంటనే మంత్రి పొంగులేటి అభినందనలు తెలియజేస్తూ మీకు నా సహాయ సహకారాలు ఉంటాయి అని ఎల్లపుడూ మీకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. అనంతరం నా సోదరుడు యలమందల జగదీష్ ను గెలిపించాలని యావత్ ఖమ్మం నగర నాయి బ్రాహ్మణ సోదరులకి మంత్రి పొంగులేటి సూచించారు. కార్యక్రమం లో ఖమ్మం నగర నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు, గుండ్లపల్లి శ్రీనివాస్, సంద్యాల రాము, సురభి సైదులు, శ్రీరాముల విజయ్, అద్దంకి పాపారావు, సంఘ సభ్యులు సురభి సందీప్, గాద శ్రీనివాస్, సింధూర నరసింహారావు, శ్రీరామ సైదులు, ఎలమందల కోటయ్య, జూలూరి హరీష్, ఎలమందల శ్రీను, గుండ్లపల్లి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో మావోయిస్టు డంపు స్వాధీనం

ములుగు, నవంబర్ 8 : మావోయిస్టులు భద్రపర్చుకున్న డంపు, మందుగుండు సామగ్రిని ములుగు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ శబరీశ్ వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. తాడ్వాయి మండలం బంధాల రిజర్వ్ అటవీ ప్రాంతంలోని ఒడ్డుగూడెం గ్రామ సమీపంలోని వెట్టెవాగు వద్ద సీపీఐ మావోయిస్టు ఆయుధాల డంపు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది.

దీంతో శుక్రవారం ఉదయం ములుగు జిల్లా పోలీసులతోపాటు బీడీటీం బృందాలు అనుమానాస్పద ప్రాంతానికి చేరుకొని సోదాలు నిర్వహించాయి. సీపీఐ మావోయిస్టులు అమర్చిన ఆయుధాల డంపును గుర్తించాయి. అందులో రెండు ఎస్ఎల్ఆర్ తుపాకులతోపాటు 165 రౌండ్ల తూటాలు, ఒక స్ప్రింగ్ ఫీల్, రెండు ఎస్ఎల్ఆర్ మ్యాగ్జిన్ల పౌచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోతే ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఆయన వెంట ఏఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీసీలను మోసం చేస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్, నవంబర్ 8: బీసీ కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తే సహించేది లేదని, బీసీ కులగణనతో పాటు ఎస్సీ వర్గీకరణ కూడా చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదారం కృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం కూకట్‌పల్లిలోని తన నివాసం వద్ద జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కానీ, సర్వేపై ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వకుండా, అసెంబ్లీలో చర్చించకుండా.. సొంత నిర్ణయంతో సర్వేను చేయడం సరైన పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలో చేస్తున్న కులగణనపై ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నామన్నారు.

పూల కుండీల్లో గంజాయి మొక్కలు

-ఇంటి యజమాని అరెస్టు

-పసిగట్టిన పోలీసు జాగిలం

-మొక్కలు స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్

వరంగల్, నవంబర్ 8: ఓ వ్యక్తి తన ఇంటి మేడపైన పూల కుండీల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న యాంటీ డ్రగ్స్ టీమ్ పోలీసులకు అడ్డంగా బుక్ అయ్యాడు. తమకు పట్టుబడిన నిందితుడిని మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు.

ఇంటి యజమాని అరెస్టు

వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పల్లెబోయిన కుమార్ అనే 60 ఏళ్ల వృద్ధుడు తన ఇంటి మేడపైనే పూల కుండీల్లో గంజాయి మొక్కల పెంపకం చేపట్టాడు.

గురువారం రైల్వే స్టేషన్ తనిఖీలు చేపట్టిన యాంటీ డ్రగ్స్ టీం పోలీసులకు ఈ విషయాన్ని కొందరు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మత్తు పదార్థాలను పసిగట్టే జాగిలంతో మేడ పైన గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించారు.

గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, నిందితుడు కుమార్‌ను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ జే.సురేష్, సిబ్బంది ఆరే శివకేశవులు తెలిపారు.

పాట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
విస్తరణ సేవా విభాగం, హైదరాబాదు
2022 సంవత్సరానికి తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు
సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం
తేది: 12-11-2024 మంగళవారం మధ్యాహ్నం 2-30 గంటలకు
వేదిక: డా. నందమూరి తారకరామారావు కళామందిరం, తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు
సభాధ్యక్షులు
ఆచార్య వెలుదండ నిత్యానందరావు
ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ముఖ్య అతిథి
డా. కె.వి. రమణాచారి, ఐఎఎస్(రి)
తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు
విశిష్ట అతిథి
ఆచార్య తంగెడ కిషన్ రావు
పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
2022 సాహితీ పురస్కారాల వివరాలు

ఉత్తమ గ్రంథం	ప్రక్రియ	రచయిత
శ్రీ వరదాభ్యుదయము	పద్యకవిత	శ్రీ పెండ్యాల కిషన్‌శర్మ
కాలం వాలిపోతున్న వైపు	వచన కవిత	శ్రీమతి మెర్సీ మార్గరేట్
ఆటా-పాటా	బాల సాహిత్యం	శ్రీ ఎన్నవెళ్ళి రాజమౌళి
సూనె సుక్క	కథ/కథానిక	శ్రీ కొట్టం రామకృష్ణారెడ్డి
కెరటం	నవల	డా. తాళ్ళపల్లి యాకమ్మ
అనుభూతి - అన్వేషణ	సాహిత్య విమర్శ	ఆచార్య వెలుదండ నిత్యానందరావు
స్వాతంత్రోద్యమ వీరుల నాటకత్రయం	నాటకం	శ్రీమతి పి.ఏ. దేవి
వీరయ్య	అనువాదం	శ్రీ గురుమూర్తి గుబిలి
ఆజాద్‌హింద్ ఫౌజ్-మణిపూరాటయోధులు	వచన రచన	శ్రీ సయ్యద్ నసీర్ అహమ్మద్
రంగంటే ఇష్టం	రచయిత్రి ఉత్తమ గ్రంథం	డా. చాగంటి తులసి

ఈ కార్యక్రమానికి మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం
రింగు రామమూర్తి
అసిస్టెంట్ డైరెక్టర్, విస్తరణ సేవావిభాగం
ఆచార్య వై. రెడ్డి శ్యామల
రిజిస్ట్రార్ I/C

శ్రీశైలం - విజయవాడ మధ్య సీ ప్లేన్ ట్రయిల్ రన్ సక్సెస్

-నేడు చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం కానున్న సర్వీస్ లు

అమరావతి, నవంబర్ 8:ఏపీలో తొలిసారిగా సీ ప్లేన్ సర్వీస్ లు ప్రారంభం కానున్నాయి.. విజయవాడ నుంచి శ్రీశైలంకు ఈ సర్వీస్ లు నడవనున్నాయి.. డీ హావిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన 14 సీట్ల సీ ప్లేన్‌ను సర్వీస్ లు సీఎం చంద్రబాబు రేపు శ్రీశైలంలో లాంచనంగా ప్రారంభించనున్నారు.. ఈ నేపథ్యంలో నేడు విజయవాడ పున్నమి ఘాట్? నుంచి శ్రీశైలం జలాశయానికి సీప్లేన్? విమానం ట్రైల్ రన్ నిర్వహించారు. విమానం సక్సెస్ ఫుల్ గా ల్యాండైంది.

అనంతరం శ్రీశైలం టూరిజం బోటింగ్ జట్టి వద్దకు సీ ప్లేన్ చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు.

సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో శ్రీశైలం రిజర్వాయర్ చుట్టే భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. శ్రీశైలం అడవుల్లో గ్రేహౌండ్స్ బలగాలు జల్లెడ పట్టాయి. శ్రీశైలం రిజర్వాయర్ లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, పోలీసు బలగాలు హై స్పీడ్ ఇంజన్ బోట్లతో రెస్క్యూ టీమ్ అప్రమత్తమైంది. సీఎం శ్రీశైలం పర్యటన నేపథ్యంలో భారీ పోలీసు బలగాలు తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్ .. బాంబు స్క్వాడ్ బృందాలు శ్రీశైలానికి చేరుకున్నాయి. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా , సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు జెసి విష్ణు చరణ్, ఏఎస్పీ బృంద అధికారులు పర్యవేక్షించా

కూతురుకు సిలిండర్ ఇచ్చావని దంపతుల మధ్య గొడవ

- ఘర్షణ తారాస్థాయికి చేరిన గొడవ భార్యను చంపిన భర్త

అమరావతి నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: కూతురుకు సిలిండర్ ఇచ్చావని దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో భార్యను భర్త చంపాడు. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?. పామర్రుపాడు గ్రామంలోని దుళ్లవానిగూడెంలో వేమూరుఇ వెంకటేశ్వరరావు(72), జమమ్మ(67) అనే దంపతులు నివసిస్తున్నారు. జయమ్మ తన భర్తకు చెప్పకుండా కూతురు గ్యాస్ బండ ఇచ్చింది. దీంతో గ్యాస్ కూతురు ఎందుకు ఇచ్చావని భార్యను భర్త ప్రశ్నించాడు.దీంతో దంపతులు మధ్య గొడవ తారాస్థాయికి చేరుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన భర్త భార్య తలను మంచం కోడుకు కొట్టడంతో ఆమె ఘటనా స్థలంలో చనిపోయింది. అనంతరం మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి రైలు పట్టాలపై వేసి ఆత్మహత్య చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. మృతదేహాన్ని తీసుకెళ్తుండగా స్థానికులు గమనించి అడగడంతో శవాన్ని వదిలేసి భర్త పారిపోయాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భర్త అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా నిజాలు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపాడు.

ఎన్‌టీపీసీ లో 50వ ఆవిర్భావ దినోత్సవం దేశాభివృద్ధికి అయిదు దశాబ్దాలుగా అందదండలు

న్యూఢిల్లీ, నవంబర్ 8: భారతదేశంలో అతి పెద్ద విద్యుదుత్పాదక సంస్థ ఎన్‌టీపీసీ లిమిటెడ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహించుకొంది. ఈ సంస్థ ఇన్నేళ్లుగా మన దేశ విద్యుత్తు రంగానికి దన్నుగా నిలుస్తూనే వృద్ధిలోను, నూతన ఆవిష్కరణలలోను అసాధారణ పురోగతిని సాధిస్తూ వస్తోంది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎమ్‌డీ) శ్రీ గుర్‌దీప్ సింగ్ ఎన్‌టీపీసీ జెండాను నోయెడా లోని ఇంజినీరింగ్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఈఓసీ)లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బోర్డు డైరెక్టర్లతోపాటు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ వేడుకలలో ఎన్‌టీపీసీ దేశవ్యాప్త కార్యాలయాలకు చెందిన ఉద్యోగులు వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం ద్వారా పాలుపంచుకొన్నారు.

ఇదే కార్యక్రమంలో ఎన్‌టీపీసీ సీఎమ్‌డీ లే ప్రాంతంలో త్వరలో సేవలను అందించనున్న హైడ్రోజన్ బస్సులను దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. ఈ హైడ్రోజన్ బస్సులను స్వచ్ఛ సాంకేతికతను, కాలుష్యానికి తావివ్వని టెక్నాలజీని మునుముందుకు తీసుకుపోవాలని ఎన్‌టీపీసీ చెప్పుకున్న సంకల్పాన్ని నెరవేర్చే దిశలో ఒక ముందడుగు అని చెప్పాలి.

ఎన్ టీపీసీ సీఎమ్ డీ ఒక ప్రధాన కార్యసాధనను గురించి కూడా ప్రకటించారు. అది ఏమిటంటే- పీఈఎమ్ ఎలక్ట్రోలైజర్ నుంచి ఉత్పత్తి చేసిన హైడ్రోజన్‌కు ఫ్లూ గ్యాస్ నుంచి వేరు పరచిన కార్బన్ డైయాక్సైడ్ (సీఓ2) ను కలిపి, ఆ తరువాత ఆ మిశ్రమాన్ని ఎన్‌టీపీసీ వింధ్యాచల్ కర్మాగారంలో మిథనాల్ గా మార్చే ప్రక్రియే.

కార్బన్ డై ఆక్సైడ్ ను ఒడిసిపట్టేందుకు ఏర్పాటు చేసిన ప్లాంటు, కార్బన్ డై ఆక్సైడ్ నుంచి మెథనాల్ తయారీ ప్లాంటు.. ఈ రెండూ కూడా ప్రపంచంలో ఈ కోవకు చెందిన మొట్టమొదటి ప్లాంట్లు కావడం విశేషం. కర్బనః నియంత్రణతో పాటు, పర్యావరణానికి తక్కువ నష్టంతో ఇంధనాన్ని ఉత్పత్తి చేసే దిశలో వేసిన ఒక చరిత్రాత్మక ముందడుగుకు గుర్తుగా ఈ ప్లాంట్లు ఉన్నాయని శ్రీ గుర్‌దీప్ సింగ్ అన్నారు.

తదుపరి తరానికి చెందిన (జెన్-4) ఇథనాల్, పర్యావరణ హిత యూరియా ఉత్పత్తి (గ్రీన్ యూరియా), ఇంకా దీర్ఘకాలం పాటు వినియోగించ గలిగే విమానయాన ఇంధన

దేశంలో 25 శాతం మందికి వెరికోస్ వెయిన్స్ సమస్యలు

హైదరాబాద్, నవంబర్ 8: మన దేశంలో దాదాపు 25 శాతం మంది ప్రజలు వెరికోస్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్నారని, వీళ్లలో చాలామందికి శస్త్రచికిత్సలు అవసరం లేకుండానే నయం చేయొచ్చని జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక అత్యాధునిక చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని అందిపుచ్చుకుని దేశంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా అద్భుతమైన చికిత్సలు చేయొచ్చని వివరించారు.

హైదరాబాద్ నగరంలోని అవిస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మాదాపూర్‌లో గల డిస్ట్రిక్ట్ 150 కాన్ఫరెన్స్ హాల్లో జాతీయ స్థాయిలో ఇండియన్ వెయిన్ కాంగ్రెస్ 2024 సదస్సును శుక్రవారం నిర్వహించారు. దీనికి అవిస్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు, ప్రముఖ వాస్క్యులర్ ఇంటర్వెన్షనల్ నిపుణుడు డాక్టర్ రాజా వి. కొప్పాల నేతృత్వం వహించారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 100 మంది వరకు వైద్య నిపుణులు దీనికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. బ్రెజిల్ నుంచి కొందరు నిపుణులు ఆన్‌లైన్‌లో హాజరై తమ అభిప్రాయాలు, అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా వెరికోస్ వెయిన్స్ సమస్యను శస్త్రచికిత్సలు అవసరం లేకుండా లేజర్ల ద్వారా, ఇతర మార్గాల్లో నయం చేయడం ఎలాగన్న అంశంపై ఇందులో విస్తృతంగా చర్చించారు. అవిస్ ఆస్పత్రిలో గత ఎనిమిదేళ్లుగా ఇప్పటికి దాదాపు 40 వేల మందికి పైగా రోగులకు శస్త్రచికిత్స అవసరం లేకుండా నయం చేశామని, ఈ రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్ రాజా వి. కొప్పాల అన్నారు.

అంతర్జాతీయంగా పేరున్న డాక్టర్ రోడ్రిగో గోమ్స్ డీ ఒలీవియెరా, డాక్టర్ రాజేష్ వాసు, డాక్టర్ ఫెర్రనాండో ట్రెస్ సిల్వెరియా లాంటి వాస్క్యులర్, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ నిపుణులు ఈ సదస్సుకు హాజరై.. అంతర్జాతీయంగా ఈ రంగంలో వస్తున్న పలు మార్పులు, చికిత్సా విధానాలు, ఎదురవుతున్న సవాళ్ల గురించి సుదీర్ఘంగా చర్చించారు. వీరితో పాటు వాస్క్యులర్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు కూడా పాల్గొన్నారు. కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్సలు అవసరం లేదని, అయితే కొన్నిసార్లు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన వాస్క్యులర్ సర్జన్లు, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టులు ఈ రెండు రోజుల సదస్సులో పాల్గొని, ఏయే రకాల సమస్యలకు ఎలాంటి చికిత్సలు ప్రభావవంతంగా ఉంటాయో తెలిపారు. సంక్లిష్టమైన కేసుల విషయంలో ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న విషయాన్ని సీనియర్ వైద్యులు వివరించారు. వెరికోస్ వెయిన్స్ విషయంలో అద్భుతమైన పరిశోధనలు జరుగుతున్నాయని, వాటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా విజ్ఞాన సముపార్జన చేయాలని సూచించారు.

అగ్రశ్రేణి వాస్క్యులర్ నిపుణులందరూ హైదరాబాద్ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడం, అన్ని ప్రాంతాల వైద్యులకు ఈ సమస్యలు, వాటి చికిత్సా విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో మంచి విషయమని అవిస్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ రాజా వి. కొప్పాల తెలిపారు. ఇది కేవలం సమాచారాన్ని పంచుకోవడానికి మాత్రమే కాదని, భారతదేశంలో భవిష్యత్తు వైద్యవిధానాలనే మార్చేందుకు ఒక అద్భుత అవకాశమని ఆయన అన్నారు. శస్త్రచికిత్సలు అవసరం లేకుండా నయం చేసే విధానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో మన దేశంలోని వివిధ ప్రాంతాల వైద్యులు కూడా వీటి గురించి తెలుసుకుని, తమ ప్రాక్టీసులో అమలుచేసే అవకాశం ఉందని తెలిపారు. దాంతోపాటు.. లేజర్ సహా ఈ రంగంలో ఉపయుక్తంగా ఉండే పలు పరికరాలను ఉత్పత్తి చేసే మెడ్‌ట్రానిక్ తదితర పలు కంపెనీల జాతీయ స్థాయి ప్రతినిధులు కూడా హాజరై, తమ పరికరాలు ఏయే విభాగాల్లో ఎలా ఉపయోగపడతాయో వివరించారు.

వైసీపీ మాజీ మంత్రులందరూ జైలుకు వెళ్లడం ఖాయం : ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

అమరావతి, నవంబర్ 8: వైసీపీ పాలనలో ప్రజాధనం లూటి చేసిన మాజీ మంత్రులపై విచారణ కొనసాగుతుందని, వారందరూ జైలుకు వెళ్లడం ఖాయమని ఏపీ రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వెల్లడించారు.

ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలపై మాట్లాడితే జగన్ రాయలసీమ బిడ్డగా ఒప్పుకుంటామని పేర్కొన్నారు. విలాసవంతమైన భవనాల్లో గడిపే వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు చంద్రబాబును విమర్శించే హక్కు లేదని అన్నారు. సీనియర్ ఎన్‌టీఆర్ తరువాత రాజకీయాల్లో ఆ స్థాయిలో పవన్‌కల్యాణ్ రాణిస్తున్నారని ప్రశంసించారు.

ఇప్పుడు ఇళ్లకి పంపేది ఎవరు..?

హైదరాబాద్, నవంబర్ 8:కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇంటింటి వివరాలను సేకరించి స్టికరింగ్ చేసే ప్రక్రియ శుక్రవారంతో పూర్తవుతుందని, 9వ తేదీ నుంచి అసలు సర్వే మొదలవుతుందని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన సమగ్ర సర్వేపై నాడు టీడీపీ నేతగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

వ్వాలా..? ఎవడన్న బుద్ధి ఉంటేటోడు చేసే పనేనా..? ఇది అని నాడు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి నిలదీశారు. మరి ఇవాళ ఇప్పుడు అడ్డమైనోళ్లని ఇళ్లకి పంపేది ఎవరు? వాళ్ళని ఏమనాలి అని రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ నేత సతీశ్ రెడ్డి నిలదీశారు.

ఇవాళ అడ్డమైనోని మన ఇంటికి పంపించి మన ఆస్తులు, మన ఖాతాలు, మన వివరాలన్నీ అడ్డమైనోని చేతిల పెట్టమంటడ. ఎవడన్న బుద్ధి ఉండేటోడు చేసే పనేనా..? మెడకాయ మీద తలకాయ ఉన్నోడు ఎవడన్న మంది వివరాలు ఎటు పోయిన పర్వా లేదు అనుకుంటుండ ఈ ముఖ్యమంత్రి గారూ. కనీస పరిజ్ఞానం, జ్ఞానం ఉన్నోడు ఎవడైనా చేసే పనేనా..? ఇట్లాంటి వివరాలు సేకరించమంటడ. ఏదో ఎగిరి దుంకి చేస్తున్న అన్నట్టు మాటలు మాట్లాడుతున్నడు అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

కనీసం ఈరోజైన అరెస్ట్‌లు లేకుండా పాలించండి - రేవంత్ కు హరీశ్ హితవు

హైదరాబాద్, నవంబర్ 8: పుట్టిన రోజు నాడైనా ఎటువంటి అరెస్ట్ లు లేకుండా పరిపాలన చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హారీష్ రావు జన్మదిన శుభకాంక్షలు తెలిపారు.. ఇదే సమయంలో ముఖ్యమంత్రి మూసి పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని ఆయన ఖండించారు. మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, భూపాల్ రెడ్డి సహా ఇతర బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను హౌస్ అరెస్టులు చేసినంత మాత్రాన మీ పాదయాత్రకు ప్రజల మద్దతు లభించదని అన్నారు..ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉందని హరీశ్ రావు సెటైర్ వేశారు.. మూసీ మురికి కూపంగా మారడానికి మీ 50 ఏళ్ల కాంగ్రెస్ పాలన కారణం కదా? అంటూ నిలదీశారు. పాదయాత్ర కాదు, పాప పరిహారయాత్ర చేసినా మీ కాంగ్రెస్ పార్టీ పాపం పోదు రేవంత్ రెడ్డి? అని అన్నారు. పేదల గూడు కూల్చింది ఒక దగ్గర, మీ పాదయాత్ర మరొక దగ్గర అంటూ ఎత్తిపోడిచారు.

హైదరాబాదులో ఇండ్లు కూల్చి, నల్లగొండలో పాదయాత్ర చేస్తారా? ఇదేంటని ప్రశ్నించారు. దమ్ముంటే.. హైదరాబాద్ నుండి మీ పాద యాత్ర మొదలు పెట్టండి అంటూ సవాల్ విసిరారు. మీ పాదయాత్రకు ప్రజల మద్దతే ఉండి ఉంటే, ఈ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు ఎందుకు రేవంత్ రెడ్డి? అని అన్నారు. మీ 11 నెలల పాలనే కాదు, మీ పాదయాత్ర కూడా నిర్బంధాల మధ్య కొనసాగుతుండడం దురదృష్టకరం అంటూ వ్యంగ్యాస్త్రాలు సందించారు. కాగా, అరెస్టులు, అక్రమ నిర్బంధాలు చేసిన మా పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నీళ్లు లేక నిలిచిపోయిన సర్జరీలు.. నీలోఫర్ హాస్పిటల్‌లో నరకం చూసిన రోగులు

హైదరాబాద్, నవంబర్ 8:కాంగ్రెస్ ప్రజా పాలన ప్రజల చావుకొచ్చినట్లయింది. బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానలు నేడు సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. తాజాగా నగరంలోని నీలోఫర్ హాస్పిటల్‌లోనీళ్లులేక సర్జరీలుఆగిపోయిన దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళ్తే..రెండు రోజుల క్రితం దవాఖానలోని సంపు పద్ద ఉన్న బోర్ పాడవడంతో అత్యవసర విభాగంలోని ఐదంతస్తులకు నీటి కొరత ఏర్పడింది.

ఈ భవనంలో పిడియాట్రిక్, పిడియాట్రిక్ సర్జరీ, గైనిక్ విభాగానికి సంబంధించి ప్రసవాల గదితోపాటు నిత్యం 25 నుంచి 30 సర్జరీలు జరిగే ఆపరేషన్ థియేటర్ ఉన్నాయి. రెండు రోజులుగా నీరందక నరకం చూసినట్లు రోగులు, రోగి సహాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పశువుల వైద్యున్ని వెంటనే నియమించాలి

-కాంగ్రెస్ యువనేత ఊటుకూరి రంజిత్

ఖమ్మం, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలం పెద్దగోపతి గ్రామపంచాయతీలో పశువుల వైద్యుడు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేసిన కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊటుకూరి రంజిత్, జిల్లా కలెక్టర్ ని పెద్దగోపతి గ్రామ పంచాయతీలో వెటర్నరీ డాక్టర్ లేక ఆరునెలలు, చుట్టుపక్క గ్రామాల నుండి రైతులు పెద్దగోపతి పశువుల వైద్యశాలకు 7గ్రామాల నుండి రైతులు వస్తారని జిల్లా కలెక్టర్ కి వివరించారు. పెద్దగోపతి గ్రామానికి వెటర్నరీ డాక్టర్ ని వెంటనే నియమించాలని కోరిన ఊటుకూరి రంజిత్, గ్రామ రైతులు, తదితరులు ఉన్నారు.

మందుబాబుకు రెండు రోజుల ట్రాఫిక్ డ్యూటీ !

కరీంనగర్, నవంబర్ 8: మద్యం సేవించి వాహనాలు నడిపిన మందుబాబులకు షాక్ ఇస్తూ పెద్దపల్లి న్యాయమూర్తి మంజుల తీర్పు నిచ్చారు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ 20 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు.

విచారించిన న్యాయమూర్తి మంజుల 20 మందికి 23 వేల రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన కమాన్పూర్ కు చెందిన ఇందాక రమేష్ కు 500 రూపాయల జరిమానాతో పాటు సామాజిక సేవలో భాగంగా రెండు రోజులపాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పునిచ్చారు.

శని, ఆదివారాల్లో రమేష్ ట్రాఫిక్ విధుల్లో ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఇకపై తరచు వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని పెద్దపల్లి ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పదు అన్నారు.

ఇప్పటికీ అదే నిర్లక్ష్యం.. అదే అలసత్వం.. గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలపై హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 8:గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనల పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా, ప్రభుత్వ తీరు మారడం లేదని.. గురుకుల విద్యార్థుల కష్టాలు తీరడం లేదని అన్నారు. ఇప్పటికీ అదే నిర్లక్ష్యం, అదే అలసత్వం కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫుడ్ పాయిజనింగ్ వల్ల మంచిర్యాల గిరిజన గురుకులంలో 12 మంది విద్యార్థినులు ఆసుపత్రి పాలైన ఘటన గడిచి 24 గంటలు కూడా కాకముందే, మరోసారి వాంతులు, కడుపునొప్పితో విద్యార్థులు ఆసుపత్రికి చేరుకున్న పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు సరైన వైద్యం అందించలేని దుర్మార్గ దుస్థితికి ఈ ప్రభుత్వం చేరుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాడి తప్పిన పాలనకు వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. నిర్మల్, వాంకిడి, మంచిర్యాల గురుకులాల్లో ఇప్పటి వరకు మొత్తం 94 మంది ఆసుపత్రుల పాలవ్వగా, ఇంద్రవెల్లి, నిర్మల్ గురుకులాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జ్వరంతో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థుల పరిస్థితి ఇంకా అలాగే ఉందని.. అయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని మండిపడ్డారు. మొద్దు నిద్ర వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను పోను బిడ్డో సర్కారు దవాఖానకు అనేది ఏండ్ల నుంచి వస్తున్న కాంగ్రెస్ పాలన మార్క్ అయితే, ఇప్పుడు నేను పోను బిడ్డో గురుకుల పాఠశాలకు అనేది కాంగ్రెస్ సర్కారు నయా మార్క్ గా మారిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, పతనమవుతున్న గురుకులాలపై సమీక్ష నిర్వహించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలీసులకు చిక్కిన వర్రా రవీందర్ రెడ్డి

అమరావతి, నవంబర్ 8: వైసిపి సామాజిక మాధ్యమ కార్యకర్త, సోషల్ మీడియా సైకోగా పేరొందిన వర్రా రవీందర్ రెడ్డి పోలీసులకు చిక్కాడు.. ఆంధ్ర- తెలంగాణ సరిహద్దులోని మహబూబ్నగర్ పరిసర ప్రాంతాల్లో అతడిని పట్టుకున్నారు. రవీందర్రెడ్డిని రేపు మీడియా ఎదుట ప్రవేశపెట్టే అవకాశముంది. రెండు రోజుల క్రితం కడప పోలీస్ స్టేషన్ నుంచి అతడు తప్పించుకున్న సంగతి తెలిసిందే. అతడిని పట్టుకునేందుకు 4 ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు హైదరాబాద్, బెంగళూరుతో పాటు కమలాపురం, పులివెందుల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు.

వర్రా రవీందర్రెడ్డి సోషల్ మీడియాలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనిత, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, జగన్ తల్లి విజయమ్మ, మాజీ మంత్రి వివేకానందరెడ్డి కుమార్తె సునీతలపై సోషల్ మీడియాలో అత్యంత హేయంగా, జుగుప్సాకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

ఆయనపై మంగళగిరి, హైదరాబాద్ లో కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కడప పోలీస్ స్టేషన్కు తరలించారు. అనంతరం వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు వదిలేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు తీవ్రంగా స్పందించారు. కర్నూలు రేంజ్ డీఐజీ ప్రవీణ్ను కడపకు పంపి ఆయన ఇచ్చిన నివేదిక మేరకు జిల్లా ఎస్పీని బదిలీ చేయడంతో పాటు మరికొన్ని చర్యలకు ఉపక్రమించింది. పులివెందులకు చెందిన వైకాపా కీలక నేతతో పోలీసులు చేసుకున్న లోపాయికారి ఒప్పందంతో 41-ఏ నోటీసులిచ్చి వదిలేసినట్లు ఆరోపణలున్నాయి.

నోటీసులిచ్చి వదిలేసే సమయంలో మరో కేసులో అరెస్టు చేసేందుకు రాజంపేట పోలీసులు కడపకు రాగా, కడప పోలీసులు వారికి అప్పగించకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో రవీందర్రెడ్డి పారిపోయాడు. తాజాగా అతడిని పట్టుకున్నారు పోలీసులు .

ఎపిలో పెద్ద సంఖ్యలో డిఎస్పీలు బదిలీ

అమరావతి, నవంబర్ 8:ఎపిలో నేడు పెద్ద సంఖ్యలో డిఎస్పీలను బదిలీ చేశారు.. ఈ మేరకు డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు.. మొత్తం 20 మంది డిఎస్పీలు స్థాన చలనం కలిగించారు.. అలాగే బదిలీ అయిన వారంతా తక్షణం కొత్త చోటులో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోవు! హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 8: కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోని నువ్వు.. సీఎం స్థాయి దిగజారి మాట్లాడుతున్నావ్ అంటూ రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. సుమతీ శతకానికి సంబంధించిన పద్యాన్ని ట్వీట్ చేశారు హరీశ్‌రావు.

ఈ పద్యం సీఎం రేవంత్ రెడ్డికి సరిగ్గా సరిపోతుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తప్పు మీద తప్పు చేసి వదరబోతులా ప్రవర్తిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి తీరును ప్రజలందరు గమనిస్తున్నారు. నీ పుట్టిన రోజున తండ్రి వయసున్న కేసీఆర్ మీద, తెలంగాణ కోసం కొట్లాడిన గొప్ప వ్యక్తి మీద, నువ్వు చేసిన నీచమైన వ్యాఖ్యలు అత్యంత హేయం. నీ లాగా వికృతంగా మాట్లాడే ముఖ్యమంత్రి నీ ఈ దేశం ఎప్పుడూ చూసి ఉండదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మూసీ నీళ్ళ మురికితో కడిగినా నీ నోరు మురికి పోదు. నీ వంకర బుద్ధి ఇగ మారదు. నీ లాగా చిల్లరగా మేము మాట్లాడలేము.

పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని, అభివృద్ధి పథంలో నడిపిన గంభీరమైన చరిత్ర మాది. బ్యాగులు మోసి, బ్యాగులు పంచి అడ్డ తోవన అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర నీది. నీ దోపిడిని, నీ దొంగబుద్ధిని నిరూపించి ప్రజా క్షేత్రంలోనే నీకు బుద్ధి చెబుతం. పిచ్చి ప్రగల్భాలు మాని పరిపాలన మీద దృష్టి పెట్టు. నిరంకుశత్వం మాని నిర్మాణాత్మక నిర్ణయాలపై శ్రద్ధ వహించు అని హరీశ్‌రావు సూచించారు.

అమెరికాలో నాకు ఎలాంటి భవిష్యత్తూ కనిపించట్లేదు.. ట్రంప్ గెలుపుపై మస్క్ కుమార్తె ఆందోళన



న్యూఢిల్లీ, నవంబర్ 8:। అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రత్యర్థి డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై గెలుపొందారు. ట్రంప్ గెలుపు కోసం ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ (ఇశ్రీనీని ఓబీబన) కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఎన్నికల్లో ట్రంప్ గెలవడంతో.. టెస్లా బాస్ ఫుల్ ఖుషీ అవుతున్నాడు. అయితే, ట్రంప్ గెలవడంతో ఆయన కుమార్తె వీవియన్ జెన్సా విల్సన్ మాత్రం తీవ్ర ఆందోళన చెందుతోంది. అమెరికాలో తనకు ఎలాంటి భవిష్యత్తూ కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

ట్రంప్ విజయంతో అమెరికాలో ఇక తనలాంటి ట్రాన్స్‌జెండర్లకు భవిష్యత్తు లేదని తేలిపోయిందని పేర్కొంది. ఇటీవలి కాలంలో దేశం విడిచి వెళ్లాలనే ఆలోచన తరచూ తన మదిలోకి వచ్చేదన్నారు. ట్రంప్ గెలిచాడనే వార్త విన్నాక తన ఆలోచనకు మరింత స్పష్టత వచ్చిందని వివరించారు. 'ట్రంప్ నాలుగేళ్లే అధ్యక్షుడిగా ఉండనున్నాడు. లింగమార్పిడి వ్యతిరేక నిబంధనలు ఒక్కసారిగా అమల్లోకి రాకపోయినా.. వాటిని కావాలని ఓటేసినవారు అంత తొందరగా మారరుగా. ట్రాన్స్ జెండర్లకు అమెరికాలో భవిష్యత్తు లేదనే స్పష్టత వచ్చింది' అంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ థ్రెడ్‌లో ఓ పోస్టు పెట్టింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

జేవియర్.. మస్క్ తొలి భార్యకు కలిగిన సంతానం. 2000లో జస్టిస్ విల్సన్‌ను మస్క్ పెళ్లాడాడు. అయితే కొన్ని రోజుల తర్వాత ఇద్దరి మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా ఆమెకు 2008లో విడాకులు ఇచ్చేశాడు. అయితే ఈ జంటకు ఏడు మంది సంతానం. అందులో జేవియర్ ఒకరు. పుట్టుకతో పురుషుడిగా పుట్టిన జేవియర్ ఆ తర్వాత 18 ఏళ్లు నిండాకా అమ్మాయిగా తన లింగాన్ని మార్చుకున్నారు. అంతేకాదు తనకు తండ్రితో ఎలాంటి సంబంధం ఉండకూడదని చట్టపరంగా తన పేరును కూడా మార్చుకుంది. తన తండ్రితో కానీ, ఆయన ఆస్తితో కానీ, ఆయనకు సంబంధించిన వేటితో తనకు సంబంధం లేకుండా తన పేరు మార్చుకోవడానికి అనుమతినివ్వాలని కోర్టుకెక్కిన మస్క్ కూతురు తన అసలు పేరు జేవియర్ అలెగ్జాండర్ మస్క్ తీసేసి వీవియన్ జెన్సా విల్సన్‌గా తన గుర్తింపును మార్చుకుంది. ఆ తర్వాత నుంచి ఆమె మస్క్‌కు దూరంగా ఉంటోంది. అయితే, ఈ విషయం ట్విట్టర్ బాస్‌ను ఎంతో బాధించిందట.

ఎలాన్ మస్క్ జీవిత చరిత్ర ఆధారంగా వాల్టర్ ఐసాక్సన్ ఓ పుస్తకాన్ని రాశారు. అందులో 'నా కుమార్తె సోషలిజం నుంచి పూర్తిగా కమ్యూనిజం వైపు మళ్లింది. డబ్బున్న ప్రతీ ఒక్కరూ చెడ్డవారని భావించే స్థితికి చేరుకుంది. కన్నబిడ్డతో విబేధాలు నన్నెంతో బాధించాయి. కూతురితో సఖ్యత కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా తను నాతో ఉండేందుకు అంగీకరించలేదు. తొలి సంతానం మరణం తర్వాత ఇంతగా వేదన మిగిల్చింది మరొకటి లేదు' అని మస్క్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తన కూతురు ట్రాన్స్‌జెండర్‌గా మారడానికి కారణం ఆమె చదువుకున్న స్కూలేనని మస్క్ అప్పట్లో ఆరోపించారు.

పంజగుట్టలో హోంగార్డు పైకి దూసుకెళ్లిన కారు :

హైదరాబాద్, నవంబర్ 8:పంజాగుట్టలో కారు బీభత్సం సృష్టించింది. తనిఖీలు చేస్తున్న పోలీసుల పైకి కారు దూసుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఎప్పటిలాగే కారు బ్లాక్ ఫిల్మ్ చెకింగ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారు వేగంగా వచ్చి హోంగార్డు రమేష్‌ను ఈడ్చుకెళ్లింది. కాగా, పంజగుట్ట ట్రాఫిక్ ఎస్ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కారు డ్రైవర్ సయ్యద్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆహ్వానము
జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్
ప్రతిభ పారితోషిక పురస్కారాల ప్రదానోత్సవం
ఒకొక్కరికి రూ॥ 2,000/- నగదు పురస్కారం
విశిష్ట అతిథులు : "సేవారత్న" పద్మకొండ వెంకటరావు, కళాపోషకులు,
: శ్రీ సయ్యద్ జానీభాషా, కవి, రచయిత, గుంటూరు
ప్రతిభ పురస్కార స్వీకర్తలు
సాంస్కృతిక కార్యక్రమాలు - సంగీతం
శ్రీమతి కె. సుప్రియచక్రవర్తి సంగీత గురువు, డైరెక్టర్ సారంగి మ్యూజిక్ అకాడమి మరియు శిష్యులు కె. పావని కుమారి, యం. పూజ, బి. దివ్య కుచిపూడి నృత్యం, బేబి శేషబట్టార్ ఆరోహి శరణ్య
14-11-2024, గురువారం, సా॥ 5.30 గంటలకు,
రాజమండ్రి రాజారావు రాజారావు, శ్రీ శాస్త్రాయి గానమర్, విజయవాడ.

ప్రతిభ నగదు పురస్కార స్వీకర్తలు
నల్లీయ వై.కె. నాగేశ్వరరావు జ్ఞాపకార్థం
మిత్రుడు శ్రీ పి.వి. రాఘవరెడ్డి నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ ఎం.ఎ. హామీద్
సేవారత్న పద్మకొండ వెంకటరావు నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీమతి కె. సుప్రియచక్రవర్తి
డా॥ రామరాజా శ్రీనివాసరావు, (గుంటూరు) నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీ బానూరు వేణుగోపాల రావు
నల్లీయ కలకోటి అబయక్రష్ణా రెడ్డి, జ్ఞాపకార్థం
తాతయ్య శ్రీ గుబబండి వెంకటరెడ్డి నెలకొల్పిన
పారితోషిక స్వీకర్త డా॥ జి. అపర్ణప్రసాద్, విజయవాడ
శ్రీమతి యం. సీతాకుమారి నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీమతి శేషబట్టార్ రజత ఆచార్య
శ్రీ సయ్యద్ జానీభాషా, గుంటూరు నెలకొల్పిన పారితోషిక స్వీకర్త
శ్రీమతి మృదుల కడియాల
నల్లీయ కర్రం వెంకటరెడ్డి, నల్లీయ బిబయలక్ష్మి
దంపతుల జ్ఞాపకార్థం అల్లుడు శ్రీ ఎ.

మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మారుపక నంది కామన్ వద్ద నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసన సభ్యులు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక నాయకులతో కలసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిల్లి కనకయ్య, ఎర్రం రాజు, గాలి పెల్లి సామి గౌడ్, శ్రీనివాసరావు, ఉ రిడి రామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి, అతని వియ్యంకుడు సగం రాష్ట్రాన్ని దోచేశారు

- తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

నెల్లూరు నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వైసీపీ ఎంపీ విజయసాయి టీడీపీ, సీఎం చంద్రబాబుపై ట్విట్టర్(ఎక్స్)లో చేసిన పోస్ట్‌పై సర్వేపల్లి ఎమ్మెల్యే, తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వ్యనీగ్యాస్తాలు సందించారు. తాను కేంద్ర మంత్రి అయితే, కార్మికులను, కూలీలను లాభాల్లో భాగస్వామ్యులను చేస్తానంటూ చెప్పారు. ఎంపీ అయితేనే విజయసాయి, అతని వియ్యంకుడు నగం రాష్ట్రాన్ని దోచేశారని ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

-రాజన్న ఆశీస్సులు రేవంత్ రెడ్డిపై ఉండాలి
-ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ముందు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంది కామన్ వద్ద అర్బన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారి ఆలయంలో 55 కోడెలను కట్టేసి కోడె మొక్కలు చెల్లించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణా కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయం నుండి సీఎం రేవంత్ రెడ్డికి 55వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.రేవంత్ జన్మదినం సందర్భంగా స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించడం జరిగిందని, శ్రీ రాజరాజేశ్వర స్వామి వారు, రాజేశ్వరి అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లవేళలా సీఎం రేవంత్ పై ఉండాలని ప్రార్థిస్తున్నామన్నారు.

ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా ముంపు గ్రామాలైన సంకేపల్లి రుద్రవరంలో నిద్ర చేసి, మరునాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రాజన్న ఆలయానికి వచ్చి అభిషేకం నిర్వహించి, ఈనాడు స్వామి వారి ఆశీస్సులతో సీఎం అయ్యి పెద ప్రజలకు అండగా నిలుస్తున్న వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని కొనియాడారు.

కొద్దిసేపటి క్రితమే ఆలయంలో వరంగల్ కు చెందిన ఓ మహిళ తల్లి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం వల్లనే మేము ఆలయానికి వచ్చి రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్నామనడం ప్రజా పాలనకు నిదర్శనం అన్నారు.

ఏకకాలంలో 2లక్షల చొప్పున మొత్తం 18వేల కోట్ల రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచామని, ఆనాడు రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన రెండు లక్షల ఆరోగ్య శ్రీ పరిమితిని నేడు 10లక్షలు చేశామన్నారు.

గృహ జ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, స్కిల్ యూనివర్శిటీ, స్పోర్ట్స్, యూనివర్సిటీ, మహిళా తల్లులను కోటీశ్వరులు చేయాలని ఇందిరా క్రాంతి పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచడం జరిగిందని, వేములవాడ పట్టణాన్ని, ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.50కోట్ల నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు.వేములవాడ నియోజకవర్గంతో పాటు రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని స్వామి వారిని వేడుకున్నామని తెలిపారు.రేవంత్ నాయకత్వంలో వేములవాడ నియోజకవర్గంతో పాటు రాజన్న ఆలయం అభివృద్ధి చెందుతుందని సంపూర్ణ నమ్మకం కలుగుతుందని, త్వరలోనే సీఎం రేవంత్ జిల్లా పర్యట నకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగరం వెంకట స్వామి, చిలుక రమేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కనికరపు రాకేష్ , ఇప్పపుల అజయ్, శ్రీధర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల రాష్ట్ర సదస్సు కరపత్రంను ఆవిష్కరణ

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్య కళానికేతన్ జిల్లా సాంస్కృతిక కళా సంస్థ కళాకారుల ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కళాకారుల సమావేశం నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల విభాగం అధ్యక్షులు వారాల దేవయ్య అధ్యక్షతన సమావేశం జరగగా, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి, ప్రత్యేక ఆహ్వానితులు ఉత్తర తెలంగాణ రాష్ట్ర కళాకారులు కోఆర్డినేటర్ బోర్డు రాములు, జిల్లా సమైక్య అధ్యక్షుడు సావన పల్లి శ్రీనివాస్, తెల్లం మురళి, మధు, ప్రముఖ రచయిత గాయకుడు బొజ్జ ఎల్లయ్య, కరీంనగర్ జిల్లా ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షులు సత్రం సరిత, మహిళా విభాగ అధ్యక్షులు, గాయని కరీంనగర్ జిల్లా మామిళ్ళ సత్తయ్య అన్నారపు హరీస్, గరిగంటి చంద్రయ్య, తేల్ల లత, పల్లికొండ గౌతమి, కనపర్తి హన్మాండ్లు, చిలుముల రమేష్, మాన్వాడ లక్ష్మీనారాయణ, జిల్లా కళాకారుల విభాగం ప్రధాన కార్యదర్శి చారి, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ముందుగా కళాకారులు జానపద గేయాలు, ఉద్యమ గీతాలు ఆలపించారు. అనంతరంయెల్ల పోశెట్టి మాట్లాడుతూ డిసెంబర్ 15 సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లి హైదరాబాద్ లో జరుగు తెలంగాణ ఉద్యమ కళాకారుల ఆత్మగౌరవ రాష్ట్ర సదస్సులో 33 జిల్లాల కళాకారులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. గత ప్రభుత్వం కళాకారులను పూర్తిగా విస్మరించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి జుపెల్లి కృష్ణారావుకి, ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కోరారు.

జాతీయ స్థాయి కబడ్డి పోటీలకు అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థిని ఎంపిక

కరీంనగర్, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి) కబడ్డీ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన క్రీడ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠాశాలలో ఏర్పాటు చేసినటువంటి విద్యార్థిని అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అన్ని రకాలుగా సహకారం అందిస్తూ క్రీడా రంగంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అదేవిధంగా పాఠశాలలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి వివిధ స్థాయిలలో నిర్వహింపబడే క్రీడా పోటీలకు ఎంపిక చేస్తూ ప్రోత్సాహం అందిస్తున్నామని చెప్పారు.

ఈ క్రమంలో ఇటీవల కాలంలో మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఈ నెల 3 నుంచి 5 వ తేదీ వరకు నిర్వహించినటువంటి ఎస్.జి.ఎఫ్ రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి కె. వందన, పదవ తరగతి, అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయిలో పతకం సాధించడమే కాకుండా త్వరలో మధ్యప్రదేశ్ లో నిర్వహించేటువంటి ఎస్.జి.ఎఫ్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గోనడానికి అర్హత సాధించడం చాలా గొప్ప విషయమని చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విజేతకు పుష్పగుచ్చం అందజేసి భవిష్యత్తులో మరిన్ని ఘనవిజయాలు నమోదు చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని శుభాభినందనలు తెలియజేశారు.

బస్సులో ఆమె నిద్ర పోతుండగా నగలు మాయం..

హైదరాబాద్, నవంబర్ 8:శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో భారీ చోరి కలకలం రేపింది. మహిళా బ్యాగ్ లో రూ.15లక్షల విలువ గల బంగారు ఆభరణాలను కొందరు దుండగులు అపహరించారు. మండపేట నుండి హైదరాబాద్ వస్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో ఈ ఘటన జరిగింది. బ్యాగ్ లో బంగారం కనిపించకపోవడంతో బాధిత మహిళ డయల్ 100 కాల్ చేసింది. బస్సు డ్రైవర్ కు వద్దకు వెళ్లి బాధిత మహిళ తెలపడంతో.. రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద బస్సును నిలిపివేశారు. బాధిత మహిళ ఫిర్యాదుతో బస్సును అబ్దుల్లాపూర్ మెట్టు పోలీసు స్టేషన్ కు తరలించారు.

బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. కాగా.. బాధిత మహిళ మాట్లాడుతూ.. బస్సు ఎక్కేటప్పుడు తన బ్యాగులో రూ.15లక్షల విలువ గల బంగారు ఆభరణాలు తీసుకుని బయలు దేరానని తెలిపింది. తన వద్దే బ్యాగు వుందని, అయితే ఇంతలోనే బ్యాగ్ నుంచి బంగారు ఆభరణాలు మాయమయ్యాయని కన్నీరుమున్నీరుగా విలపించింది. పోలీసులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటుంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బస్సులో అందరూ ఉన్నా.. బంగారం ఎవరు తీశారు అనేదానిపై ఆరా తీస్తున్నారు. మహిళ వద్ద రూ.15లక్షల బంగారం ఉందని బస్సులో ఎవరికి తెలిసిందని ఆరా తీస్తున్నారు.

బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తరలించి చెక్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. బస్సు మధ్యలో ఎవరైనా దిగారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. అయితే.. బస్సును పోలీస్టేషన్ కు తరలించడంతో ఉదయం 6 గంటల నుంచి ప్రయాణికులు పోలీస్టేషన్ లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలు కూడా ఉండటంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి పోలీస్ స్టేషనల్ లోనే వున్నామని, చిన్న పిల్లలను తీసుకుని ఎంత సేపు ఉండాలని మండిపడుతున్నారు. బ్యాగులు సర్చ్ చేశారని, అయినా కూడా ఎవరిని బయటకు అనుమతించడం లేదని వాపోతున్నారు.

సనాతన ధర్మాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాం : టీటీడీ చైర్మన్

తిరుపతి, నవంబర్ 8:సనాతన ధర్మాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడానికి సంకల్పంతో ముందుకు వెళతామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం, ఎస్వీ గోశాలను శుక్రవారం సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కోర్సులలో నైపుణ్యం సాధించి, సనాతన ధర్మాన్ని ప్రబోధించాలని సూచించారు. సనాతన ధర్మాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమని పేర్కొన్నారు.

ధర్మగిరి ప్రధానార్చకులు తిరుమలలో వైదిక సంస్థ ఆవిర్భావం, ప్రాభవం గురించి వివరించారు. ప్రత్యేక అధికారి ధర్మగిరి విజయలక్ష్మి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్, ఎస్వీ గోసాల డైరెక్టర్ డాక్టర్ హరనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద జీయర్ మఠాన్ని సందర్శించి పెద్ద జీయర్ స్వామి ఆశీస్సులను తీసుకున్నారు. అఖిలాండంలో బేడి ఆంజనేయ స్వామికి పూజలు చేశారు.

రాజీనామా చేయ్..

- జగన్‌కు షర్మిల సవాల్

మచిలీ పట్నం నవంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జగన్ మాత్రమే కాదు.. వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరైనా అసెంబ్లీకి వెళ్లనంటే.. తమ పదవులకు రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు. సొంత సోదరుడైనప్పటికీ కొంత కాలంగా రాజకీయంగా జగన్, షర్మిల మధ్య పచ్చగడ్డ వేస్తే భగ్గుమంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో జగన్ వ్యాఖ్యలపై షర్మిల ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తున్నారు. మీడియా సమావేశంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్తారా అంటూ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా శాసనసభకు వెళ్లే ధైర్యం లేకపోతే జగన్ రాజీనామా చేయాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ మాత్రమే కాదు.. వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరైనా అసెంబ్లీకి వెళ్లనంటే.. తమ పదవులకు రాజీనామా చేయాలని షర్మిల సవాల్ విసిరారు. సొంత సోదరుడైనప్పటికీ కొంత కాలంగా రాజకీయంగా జగన్, షర్మిల మధ్య పచ్చగడ్డ వేస్తే భగ్గుమంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో జగన్ వ్యాఖ్యలపై షర్మిల ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తున్నారు. మీడియా సమావేశంలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్తారా అంటూ అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వమంటే ఇవ్వడంలేదని, దీంతో తానకు అసెంబ్లీకి వెళ్లే ఉద్దేశం లేదని జగన్ తన మనసులో మాటను బయటపెట్టేశారు. తాజాగా అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే జగన్ రాజీనామా చేయాలంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ అధ్యక్షులు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

వారం రోజులుగా నీళ్లు బంద్.. ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు

కరీంనగర్, నవంబర్ 8: : తెలంగాణలో తాగునీటి కోసం ఆడబిడ్డలు అష్టకష్టాలు పడుతున్నారు. ఏ పల్లెకు వెళ్లి పలకరించినా కడవల్లా కన్నీళ్లు కారుస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాక, కరెంట్ లేక బిందెడు నీళ్ల కోసం మైళ్లదూరం నడిచి పోతున్నారు. తాజాగా పెద్దపలిజిల్లా యైటింక్లయిన్ కాలనీలో వారం రోజులుగా సింగరేణి నీళ్లు, మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్మికేతర వాడలకు సింగరేణి నీళ్లు ఆపేయడం సరికాదని, యథావిధిగా నీళ్లు ఇవ్వాలని మహిళలు డిమాండ్ చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మంచినీళ్లు నరఫరా చేయాలని కోరుతున్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సూపర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డ్

-ఏక కాలంలో.600 ఫార్ములాల పఠనం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 8: (నేటినిజం ప్రతినిధి): 600 గణిత ఫార్ములాలను ఏకకాలంలో పఠించడం ద్వారా శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు రికార్డు సృష్టించారు. యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధుల పర్యవేక్షణలో బుధవారం హైదరాబాద్ మియాపూర్ లోని శ్రీ చైతన్య స్కూల్లో ఈ కార్యక్రమం కొన సాగింది. ఇందులో 20 రాష్ట్రాలకు చెందిన సుమారు పదివేల మంది విద్యార్థులు ఆన్లైన్ ద్వారా భాగస్వాములయ్యారు. 2018లో దేశాల మ్యాపులు, భౌగోళిక అవగాహనలో; 2023లో 100 నిమిషాల్లో 1-100 వరకు మ్యాథ్స్ టేబుల్స్ పఠించడం ద్వారా వరల్డ్ రికార్డ్ సాధించామని శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ బి.సీమ తెలిపారు.

ఆసిఫాబాద్ జిల్లాలో అక్రమ కలప పట్టివేత

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 8: అక్రమంగా రవాణా చేస్తున్న కలపను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ సింగ్ సర్దార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలపను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆసిఫాబాద్ రేంజ్ పరిధి దంతన్‌పల్లి వద్ద తనిఖీలు చేపట్టారు. కౌటన్ మొవాడ్ నుంచి మందమర్రి వైపు వెళ్తున్న కారును ఆపడానికి సిబ్బంది ప్రయత్నించారు. నిందితులు కారు వదిలి పారిపో వడానికి ప్రయత్నించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.వారితో పాటు పల్సర్ బైక్ పై వచ్చిన ఇద్దరు నిందితులు కుంసోత్ కృష్ణ, బానోత్ శంకర్ ను అరెస్ట్ చేశామన్నారు. తనిఖీ ల్లో 12 కలప దుంగలు పట్టుబడుగా వాటి విలువ సుమారు రూ.56,236 ఉంటుందని ఆయన తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సెక్షన్ అధికారులు మహేందర్, సాయి, విజయ్, బీటు అధికారులు ప్రకాష్, సాదిక్, వెంకటేష్, స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020,Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.